## జాతీయ అథ్లెటిక్స్ పోటీల్లో సంపత్‌కు బంగారు పతకం

**నంగునూర్, ఫిబ్రవరి 4, ప్రభాతవార్త :** మండల పరిధిలోని పాలమాకుల గ్రామానికి చెందిన శిలా సాగరం సంపత్ హైదారాబాద్ గచ్చిబౌలి స్టేడియంలో నిర్వహిస్తున్న 5వ అల్ ఇండియా మాస్టర్స్ గేమ్ అథ్లెటిక్స్ 2023లో ఛాంపియన్షిప్ 40 ఏజీ విభాగంలో 5కే పరుగు పందెంలో మంచి ప్రతిభను కన బరిచి ప్రథమ స్థానంలో నిలిచి గోల్డ్ మెడల్ సాధించారు. సంపత్ ప్రస్తుతం కోహేడ మండలం జడ్పీ హెచ్ఎస్ చంచల్‌చెరువుపల్లి పాఠశాలలో ఉపాధ్యాయునిగా పని చేస్తున్నారు.


బంగారు పతకం అందుకుంటున్న దృశ్యం

మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట
వార్త



## నూతన కలెక్టరేట్ భవన నిర్మాణ పనుల పరిశీలన

**మెదక్ అర్బన్, ఫిబ్రవరి4 ప్రభాత వార్త:** నూతన కలెక్టరేట్ భవన నిర్మాణ పనులను శనివారం జిల్లా కలెక్టర్ రాజర్షిషా అదనపు కలెక్టర్ ప్రతిమ సింగ్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా పనుల పురోగతిపై అక్కడున్న అధికారులతో మాట్లాడి త్వరగా పూర్తయ్యే విధంగా చూడాలని సూచించారు. మళ్లీ వారం తరువాత వచ్చి పనులను పరిశీలిస్తానని సంబంధిత అధికారులకు తెలిపారు.


భవన నిర్మాణ పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ రాజర్షిషా

# గజ్వేల్‌లో డబుల్ ఇళ్ల లొల్లి

**అర్హులకు ఇవ్వాలంటూ ధర్నా**

**పాల్గొన్న తూంకుంట నర్సారెడ్డి**

**పోలీసుల జోక్యంతో ఉద్రిక్తంగా మారిన వైనం**


రాస్తారోకో చేస్తున్న మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి

**గజ్వేల్, ఫిబ్రవరి 4 (ప్రభాతవార్త):** ఇల్లులేని నిరుపేదలకు డబుల్ బెడ్‌రూం ఇల్లు మంజూరుచేసి నీడ కల్పిస్తామని సి ఎం కెసిఆర్ హామీ ఇచ్చి ఏడు సంవత్సరాలు గడిచినా ఇంత వరకు డబుల్ బెడ్‌రూం ఇల్లు ఇవ్వకపోవడం సిగ్గుచేటని సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి విమర్శించారు. శనివారం గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలో ఇల్లులేని అర్హులైన నిరుపేదలకు డబుల్ బెడ్‌రూం ఇళ్ళ జాబితాను మున్సిపల్ కార్యాలయంలో, ఆర్డీఓ కార్యాలయంలో ఏర్పాటు చేశారు. మున్సిపల్ పరిధి సంగాపూర్ వద్ద 1250 ఇండ్లు నిర్మించగా 1110 మంది పేర్ల జాబితా విడుదల చేశారు. జాబితాలో అర్హులైన వారి పేర్లు రాకపోవడంతో శనివారం మున్సిపల్ కార్యాలయాన్ని ముట్టడించారు. కార్యాలయం ముందు బైఠాయించి పెద్దఎత్తున నిరసన తెలిపారు. సమాచారం తెలుసుకున్న జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి బాధితులతో కలిసి అంబేద్కర్ చౌరస్తా వద్ద బైఠాయించి రాకపోకలను అడ్డుకొని రాస్తారోకో చేపట్టారు. సుమారు 2 గంటల పాటు రాస్తారోకో చేయగా మున్సిపల్ కమిషనర్ వచ్చేంత వరకు నిరసనను కొనసాగిస్తామని భీష్మించుకొని కూర్చున్నారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీలో డబుల్ బెడ్‌రూం ఇల్లు రాని బాధితుల నిరసన తారాస్థాయికి చేరుకుంది. గజ్వేల్ సిఐ వీరప్రసాద్, ఎస్ఐలు నరేష్, శంకర్, మురళిలు తమ సిబ్బందిని అప్రమత్తంచేసి బాధితులను రోడ్డుపై నుండి తరలించే ప్రయత్నం చేశారు. దీంతో కాంగ్రెస్ పార్టీ నాయకులు, బాధితులు పోలీసులకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేయడంతో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. తూంకుంట నర్సారెడ్డి స్థానిక విలేకరులతో మాట్లాడుతూ గతంలో తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు గీతారెడ్డి చేతుల మీదుగా ఇచ్చిన ఇళ్ళ పట్టాల ప్లాట్లను ప్రభుత్వం గుంజుకొని డబుల్ బెడ్‌రూం ఇల్లు కట్టిస్తానని నమ్మించి తీసుకోవడం ఎంతవరకు సమంజసమన్నారు. సిఎం కెసిఆర్ గజ్వేల్ పట్ల సవతితల్లి ప్రేమ చూపిస్తున్నారని, డబుల్ బెడ్‌రూం ఇళ్ళ కేటాయింపులో అవకతవకలు జరగడం ఏమిటన్నారు. అర్హులైన నిరుపేదలందరికీ డబుల్ బెడ్‌రూం ఇళ్ళను పంపిణీ చేయాలని లేనిచో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పెద్దఎత్తున నిరసన వ్యక్తం చేస్తామన్నారు. రాస్తారోకో చేస్తున్న నర్సారెడ్డితో పాటు కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు మొనగారి రాజు, పట్టణ ప్రధాన కార్యదర్శి నక్క రాములుగౌడ్, మైనార్టీ నాయకులు బాబా, మల్లారెడ్డి, లక్ష్మణ్, శివులు, బిసిసెల్ ఉపాధ్యక్షుడు గుంటుకు శ్రీనివాస్‌లను పోలీసులు బలవంతంగా పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ ఎస్. విద్యాధర్ బాధితులకు వివరణ ఇవ్వాలని తూంకుంట నర్సారెడ్డి సూచించడంతో కమిషనర్ విద్యాధర్ అర్హులైన అర్హులందరికీ డబుల్ బెడ్‌రూం ఇల్లు అందిస్తామని, పది రోజుల పాటు డబుల్ బెడ్‌రూం ఇళ్ళపై ఏమైనా అభ్యంతరాలు ఉంటే తాము ఏర్పాటుచేసిన డ్రాప్ట్ బాక్స్‌లో వేయాలని బాధితులకు తెలిపారు.


జ్యోతిర్లింగాలకు పూజలు చేస్తున్న శ్రీశైలం జగద్గురువు దృశ్యం

## వైదిక జ్ఞానంతో భారతదేశానికి పూర్వవైభవం

**సిద్దరామపండితారాధ్య శివాచార్య మహాస్వామి**

**ఝరాసంగం, ఫిబ్రవరి 4, ప్రభాతవార్త:** భారతీయ సంస్కృతిని, సాంప్రదాయాలను, వైదిక జ్ఞానాన్ని అందించి భారతదేశానికి పూర్వ వైభవాన్ని తీసుకువాల్సిన అవసరం ఉందని శ్రీశైలం జగద్గురువు శ్రీ 1008 డాక్టర్ చెన్న సిద్దరామపండితారాధ్య శివాచార్య మహాస్వామి పేర్కొన్నారు. మండలంలోని బర్దీపూర్‌లోని దత్తగిరి ఆశ్రమంలో కొనసాగుతున్న శతజయంతి ఉత్సవాల్లో పాల్గొనేందుకు శనివారం ఆశ్రమానికి చేరుకుని ఆశ్రమ ఆవరణలోని ద్వాదశ జ్యోతిర్లింగాలను పూజించారు. ఆశ్రమానికి చేరుకున్న మహారాజ్‌ను పూర్ణకుంభంతో ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆశ్రమ ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో భక్తులను ఉద్దేశించి ప్రసిగించారు. భారత దేశంలో ఆద్యాత్మిక ధార్మిక అంశాలు సమాజాన్ని సన్మార్గంలో పయనించేలా గురు పీఠాలు, ఆశ్రమాలు, మఠాలు భూమిక పోషిస్తున్నాయన్నారు. పీఠాధిపతులు, గురువులు, జ్ఞానవంతులై భారతీయ సనాతన పురాణాలు, వేదాలు, ధార్మిక సాహిత్యాన్ని అభ్యసించి సమాజానికి అందించాల్సిన అవసరం ఉందని గుర్తు చేశారు. దత్తగిరి ఆశ్రమ సిద్దేశ్వర ఆనంద్ మహారాజ్ ఆదివారం గురుపట్టాభిషేకం పొందుతున్న సందర్భంగా జగద్గురువు ఆశీస్సులు అందించారు. కార్యక్రమంలో మాతృశ్రీ అనసూయమాత, డాక్టర్ ములుగు అంజయ్య, గ్రామ ఉత్సవ కమిటి సభ్యులు, ఆయా ప్రాంతాలకు చెందిన భక్తులు పాల్గొన్నారు.

## కలెక్టర్‌ను కలిసిన ఎంపీపీ కల్లూరి హరికృష్ణ


కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న కల్లూరి హరికృష్ణ

**శివ్వంపేట, ఫిబ్రవరి4 ప్రభాతవార్త:** మెదక్ జిల్లా కలెక్టర్‌గా నూతనంగా పదవీ బాధ్యతలు చేపట్టిన రాజర్షిషాను జిల్లా ఎంపీపీల ఫోరం అధ్యక్షులు, శివ్వంపేట మండల పరిషత్ అధ్యక్షులు కల్లూరి హరికృష్ణ శనివారం మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. త్వరలో శివ్వంపేట మండలం అభివృద్ధి నిమిత్తం పర్యటించి పూర్తి సహకారం అందిస్తానని కలెక్టర్ రాజర్షిషా కల్లూరి హరికృష్ణతో మాట్లాడుతూ అన్నారు. ప్రజాప్రతినిధులందరూ కలిసి ప్రజల సమకారం తీసుకొని మరింత అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. జిల్లాలోనే శివ్వంపేట మండలం అభివృద్ధిలో ప్రథమ స్థానంలో ఉండటం పట్ల కలెక్టర్ ఎంపీపీ కల్లూరి హరికృష్ణను అభినందించా రు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ప్రతిమ సింగ్, మండల సర్పంచుల ఫోరం అధ్యక్షులు లావణ్య మాధవరెడ్డి, సర్పంచి బాబురావు, కోదండ కృష్ణాగౌడ్ తదితరులు ఉన్నారు.

## ఆర్డీఓ విచారణ

**కొండపాక(కుకునూర్‌పల్లి), ఫిబ్రవరి 4, ప్రభాతవార్త :** కుకునూర్‌పల్లి గ్రామంలో 533 సర్వే నెంబర్‌లో గల భూమి విషయంలో శనివారం గజ్వేల్ ఆర్డీఓ విజయేందర్‌రెడ్డి కుకునూర్‌పల్లి తహాశీల్దార్ కార్యాలయంలో విచారణ చేపట్టి సర్పంచ్ జయంతి నరేందర్, ఈగ శంకరయ్య, కమలమ్మ భూ తగాధ విషయంలో విచారణ చేపట్టిన అనంతరం ఆర్డీఓ విజయేందర్‌రెడ్డి విలేకరులతో మాట్లాడారు. ఎరుకల కమలమ్మకు వారసత్వంగా తన భర్త పేరు నుంచి కమలమ్మ పేరు మీదికి రికార్డు ప్రకారం చట్ట ప్రకారమే ఫౌతి చేయడం జరిగిందన్నారు. పొజిషన్ రికార్డు ప్రకారం ఇట్టి భూమి ఎరుకల కమలమ్మదే అని ఆర్డీఓ విజయేందర్‌రెడ్డి తెలిపారు. తహశీల్దార్‌పై వచ్చిన అరోపణలు నిరాధారమైనటువంటివి అన్నారు. ఇట్టి భూమి విషయంలో ఏమైనా అభ్యంతరాలు ఉంటే సర్పంచ్ జయంతి నరేందర్, శంకరయ్య కోర్టుకు వెళ్లొచ్చు అన్నారు. తహశీల్దార్‌పై ఆరోపణలు చేసి తహశీల్దార్ కార్యాలయం ఎదుట టెంట్ వేసి నిరసన తెలిపిన వారిపై కలెక్టర్ ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటమన్నారు.


విచారణ చేస్తున్న ఆర్డీఓ విజయేందర్‌రెడ్డి

# ఆహార ధాన్యాలకు భాండాగారంగా తెలంగాణ రాష్ట్రం

**గజ్వేల్ ఏఎంసి చైర్మన్ మాదాసు శ్రీనివాస్**

**జగదేవ్‌పూర్, ఫిబ్రవరి 4 (ప్రభాతవార్త):** దేశంలోనే తెలంగాణ రాష్ట్రం ఆహార ధాన్యాల ఉత్పత్తిలో అగ్రగామిగా నిలిచి ఆహార ధాన్యాలకు భాండాగారంగా తెలంగాణ రాష్ట్రం నిలుస్తుందని గజ్వేల్ మార్కెట్ కమిటీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్ అన్నారు. శనివారం మండలకేంద్రంలోని మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఎంపిపి బాలేషంగౌడ్ అధ్యక్షతన సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గజ్వేల్ ఏరియా అభివృద్ధి అధికారి ముత్యంరెడ్డి, ఏఎంసి చైర్మన్ మాదాసు శ్రీనివాస్‌లు హాజరయ్యారు. ముందుగా సమావేశంలో భాగంగా వ్యవసాయాధికారి వసంతరావు తమ శాఖ నివేదికను చదివి వినిపించారు. అదేవిధంగా వివిధ శాఖల అధికారులు తమ నివేదికలను సభలో వినిపించారు. వైస్ ఎంపిపి భగవంతం మాట్లాడుతూ చిన్నకిష్టాపూర్ గ్రామంలో 70 కుటుంబాలకు సంబంధించిన మురుగునీరు చెరువులో కలుస్తున్నాయని, దానిని ఏవిధంగా అయినా నివారించేలా చర్యలు చేపట్టాలని సభ దృష్టికి తెచ్చారు. అదేవిధంగా పీర్లపల్లి సర్పంచ్ మాట్లాడుతూ తమ గ్రామంలోని 191 సర్వే నెంబర్‌లో ఉన్న 200 ఎకరాల భూమికి సంబంధించిన రైతులకు గతంలో పాత పట్టా బుక్కులు ఉన్నాయని నూతనంగా వారికి పట్టా పాస్‌బుక్కులు అందించేలా చూడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆత్మ కమిటీ చైర్మన్ గుండా రంగారెడ్డి, పిఎసిఎస్ చైర్మన్ ఇంద్రసేనారెడ్డి, కొండపోచమ్మ చైర్మన్ జంబుల శ్రీనివాస్‌రెడ్డి, తహాసీల్దార్ రఘువీరారెడ్డి, ఏఎంసి వైస్ చైర్మన్ ఉపేందర్‌రెడ్డి, మండల కో-ఆప్షన్ సభ్యుడు సయ్యద్ ఎక్బాల్, వివిధ గ్రామాల ఎంపిటిసిలు మహేష్, మహేందర్‌రెడ్డి, ఎంపిటిసిల ఫోరం జిల్లా అధ్యక్షుడు కిరణ్‌గౌడ్, మండల ఫోరం అధ్యక్షుడు మాసూరి కావ్యదర్గయ్య, ఎంపిడిఓ శ్రీనివాస్‌వర్మ, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.


సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఏఎంసి చైర్మన్ మాదాసు శ్రీనివాస్

# అందోలు-జోగిపేట మున్సిపల్ చైర్మెన్, వైస్ చైర్మెన్లపై అవిశ్వాసం

**జిల్లా అడిషనల్ కలెక్టర్‌ను సంప్రదించిన అధికార పార్టీ కౌన్సిలర్లు**


జిల్లా అడిషనల్ కలెక్టర్ వీరారెడ్డితో అవిశ్వాస తీర్మాణం పెట్టాలంటూ కోరుతున్న అందోలు-జోగిపేట టిఆర్ఎస్ కౌన్సిలర్లు

**జోగిపేట, ఫిబ్రవరి 04, ప్రభాతవార్త:** అందోలు-జోగిపేట మున్సిపల్ చైర్మెన్ గూడెం మల్లయ్య, వైస్ చైర్మెన్ ప్రవీన్‌కుమార్‌లపై అధికార టిఆర్ఎస్ పార్టీకి చెందిన 11మంది కౌన్సిలర్లు తిరుగుబాటు జెండా ఎగురవేశారు. ఈ మేరకు శనివారంనాడు వారు అడిషనల్ కలెక్టర్ వీరారెడ్డితో చర్చించి, ఆయన సూచనమేరకు కలెక్టరేట్‌లోని ఇన్‌వార్డులో అవిశ్వాస తీర్మాణం పెట్టాలంటూ తమ సంతకాలతో కూడిన వినతిపత్రాన్ని అందచేశారు. గత కొంతకాలంగా అవిశ్వాస తీర్మాణంపై చర్చ జరుగుతూనే ఉంది. అయితే పార్టీలో అధిష్ఠానం సముదాయించటంతో ఊరుకుండిపోయారు. అయితే చైర్మెన్, వైస్‌చైర్మెన్ల వ్యవహారశైలి తమకు విరుద్ధంగా ఉందని, ఒంటెద్దుపోకడ పోతున్నారని, తమకు ఏ విషయంలోనూ వారి నుంచి సహకారం లేదని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు. తప్పనిసరి పరిస్థితుల్లోనే వారిద్దరిపై అవిశ్వాసం వరకూ వెళ్లాల్సివస్తుందని కౌన్సిలర్లు పేర్కొన్నారు. అవిశ్వాసం పెట్టాలని జిల్లా అడిషనల్ కలెక్టర్‌ను సంప్రదించిన వారిలో టిఆర్ఎస్‌కు చెందిన కౌన్సిలర్లు పిట్ల భాగ్యలక్ష్మి, ఉల్వాల మాధవి, పుర్ర ప్రవీణ, జకియా సుల్తాన, రాచకొండ భవాని, గాజుల ధనలక్ష్మి, నాగరాజు, దర్గేష్, చందర్, గడీండ్ల భారతి, పడిగె సుమిత్రలు ఉన్నారు.

## వృద్ధుడు ఆత్మహత్యా యత్నం


తహశీల్దార్ కార్యాలయం ఎదుట ఆత్మహత్యకు యత్నించిన వృద్ధుడు బాలరాజు

**దుబ్బాక(అక్బర్‌పేట-భూంపల్లి), ఫిబ్రవరి 4, ప్రభాతవార్త :** అక్బర్‌పేట-భూంపల్లి తహశీల్దార్ కార్యాలయం ముందు నివసిస్తున్న ఇంటి స్థలం ముందు ప్రభుత్వ భూమిలోని రేకుల డబ్బను తొలిగించడం పట్ల మనస్థాపానికి గురై వృద్ధుడు అత్మహత్యకు పాల్పడిన సంఘటన అక్బర్‌పేట-భూంపల్లి మండల కేంద్రంలో శనివారం జరిగింది. గ్రామస్తులు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన తిప్పనబోయిన బాలరాజు గత 20 యేండ్లుగా గ్రామంలో నివస్తున్నాడు. అక్బర్‌పేట గ్రామంలోని లావాణి పట్టా 121 బై 27 సర్వే నంబరులో అతనికి 27 గుంటల భూమి రికార్డులో ఉంది. అతనికి ఉన్న 20 గుంటల్లో 15 గుంటల భూమిని గెస్ట్ హౌస్ నిర్మాణానికి ప్రభుత్వం తీసుకుందని తెలిపారు. ఇది ఇలా ఉండగా నిరుపేద కుటుంబానికి చెందిన బాలరాజు జీవనోపాధి కోసం ఇంటి ముందు రేకుల డబ్బను నిర్మించుకున్నారు. రెవెన్యూ అధికారులు రేకుల డబ్బకు నోటీసులు ఇవ్వడంతో 20 యేండ్లుగా నివసిస్తున్న ఇల్లును తొలిగిస్తామని నోటీసులు ఇవ్వడం పట్ల మనస్థాపానికి గురై పురుగుల మందు తాగి అత్మహత్య ప్రయత్నం చేసుకోబోయారు. విషయం తెలుసుకున్న భూంపల్లి పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని బాధితున్ని సిద్దిపేట ప్రభుత్వ అసుపత్రికి తరలించారు. బాధితుని పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం.

## నేడు న్యాల్‌కల్ జాతరలో రైతులకు సన్మానం

**న్యాల్‌కల్, ఫిబ్రవరి 4, ప్రభాతవార్త:** మండల కేంద్రమైన న్యాల్‌కల్ గ్రామానికి చెందిన జంతు ప్రేమికుడు, శిల్పకళాకారుడు హోతి బస్వరాజ్ ఈ నెల 5న న్యాల్‌కల్‌లో జరిగే హజ్రత్ పీర్ గైబ్ సాహెబ్ జారత ఉత్సవాలకు తరలివచ్చే మూగజీవాలను పోషిస్తున్న (ఉత్తములకు) రైతులకు ప్రోత్సాహించనున్నారు. న్యాల్‌కల్‌లో జరిగే జాతర ఉత్సవాల్లో గత 16 సంవత్సరాలుగా జాతరకు చేరుకున్న పశువులల్లో మేలైన పశువులను ఎంపిక చేసి వాటిని పోషిస్తున్న రైతన్నలను ప్రోత్సాహించాలన్న ఉద్దేశంతో స్వంత ఖర్చులను భరిస్తూ బహుమతులు అందిస్తూ వస్తున్నారు. శిల్పకళలో డిగ్రీ, పీజీలను పూర్తి చేసి మంత్రులు, గవర్నర్‌లతో సన్మానాలు సైతం అందుకున్నాడు. శిల్పకళపై ఆసక్తి ఉన్న వారికి ఉచితంగా కళను, చిత్ర లేఖనను నేర్పిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నాడు. శిల్ప కళ విభాగాల్లో గౌరవ డాక్టరేట్‌ను పొందిన బస్వరాజ్ గత 23 సంవత్సరాలుగా శిల్పకళలో సేవలు అందిస్తున్నారు. దశాబ్ద క్రితం మూగ రోధన షాట్ ఫిల్మను తీసి రైతుల ఆదరణ పొందారు. బస్వరాజ్ రూపొందిచన పలు శిల్పాలకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఆదరణ లభించింది. గవర్నర్, రాత్రి మంత్రులచే బస్వరాజ్ సన్మానాలు సైతం అందుకున్నారు.

# అర్హులకే డబుల్ బెడ్ రూం ఇళ్లు

**ఎఫ్‌డిసి చైర్మన్ ప్రతాప్‌రెడ్డి**

**గజ్వేల్, ఫిబ్రవరి 4, ప్రభాతవార్త :** గజ్వేల్‌లో రాజకీయాలు చేయకుండా కాంగ్రెస్, బిజెపి నాయకులు డబుల్ బెడ్ రూంలు అర్హులైన వారిచే దరఖాస్తులు పెట్టిస్తే వారికి కూడా ఇండ్లు కేటాయిస్తామని రాష్ట్ర ఎఫ్‌డిసి చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి అన్నారు. గజ్వేల్ సమీకృత కార్యాలయ సముదాయంలో మున్సిపల్ చైర్మన్ ఎన్‌సీ రాజమౌళి, కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. గజ్వేల్ పట్టణంలో ప్రభుత్వం పేద వారి కోసం 1150 డబుల్ బెడ్ రూం ఇండ్లు నిర్మిస్తే 3512 అప్లికేషన్‌లు వచ్చాయని, మున్సిపల్ సిబ్బంది ప్రకటించిన అర్హుల జాబితా ఫైనల్ కాదని అర్హులైన వారు మళ్ళి అప్లికేషన్ పెట్టుకుంటే ప్రతి అర్హునికి డబుల్ బెడ్ రూం కేటాయిస్తామన్నారు. జాబితాలో ప్రకటించిన వారికి అస్తులు ఉన్నట్లు ఫిర్యాదు వస్తే లిస్ట్ నుంచి వారి పేరును తొలిగిస్తామన్నారు. గజ్వేల్ మున్సిపల్‌లో 750 మించి లబ్దిదారులు లేరని గజ్వేల్‌లో పేదవారు లేకుండా ప్రతి ఒక్కరికీ డబుల్ బెడ్ రూం కేటాయిస్తామన్నారు.దీనిలో రాజకీయాలు చేయాల్సిన అవసరం లేదన్నారు. దేశంలో ఎక్కడ లేని విధంగా సిఎం కెసిఆర్ అభివృద్ధి సంక్షేమ ఫలాలను గడపగడపకు పార్టీలకు అతీతంగా ప్రతి ఒక్కరికి అందిస్తున్నారని తెలిపారు. ప్రతిపక్ష పార్టీ నాయకుల మాటలు ఉద్దర మాటలు అన్నారు. ప్రభుత్వం అందిస్తున్న అనేక సంక్షేమ పథకాలను బిజెపి, కాంగ్రెస్ నాయకులు తీసుకోవడం జరుగుతుందన్నారు. అన్ని వర్గాలను అదుకోవడమే బిఆర్ఎస్ సర్కారు లక్ష్యమన్నారు. కార్యక్రమంలో గజ్వేల్ మున్సిపల్ చైర్మన్ ఎన్‌సీ రాజమౌళి, ఎఎంసి చైర్మన్ మాదాసు శ్రీనివాస్, వైస్ చైర్మన్ జకియోద్దీన్, కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు, బిఆర్ఎస్ నాయకలు పాల్గొన్నారు.

## అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం

**సంగారెడ్డి మున్సిపాలిటీ, ఫిబ్రవరి 4, ప్రభాతవార్త:** భాషా పండిత జెఎసి రాష్ట్ర శాఖ పిలుపు మేరకు శనివారం నాడు సంగారెడ్డిలో తెలుగు, హిందీ భాషోపాధ్యాయులు పదోన్నతుల కోసం బైపాస్‌లోగల అంబేడ్కర్ భవనంలోని డాక్టర్ బిఆర్ అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించి నిరసన వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని ఉన్నత పాఠశాలలో ఫిబ్రవరి 1వ తరగతి నుండి 9, 10వ తరగతుల విద్యాబోధనలో సహాయ నిరాకరణ జరుపుతున్న భాషోపాధ్యాయులు దశాబ్దాలుగా అన్యాయానికి గురౌతున్నా మే ఎన్నేళ్ళని వెట్టి చాకిరి చేయాలనీ సిఎం కెసిఆర్‌కు ప్రపంచ తెలుగు మహాసభల్లో ఇచ్చిన మాట ప్రకారం ఈ పదోన్నతుల్లోనే భాషోపాధ్యాయులకు పదోన్నతులు కల్పించి ఇటు రాష్ట్ర భాష తెలుగుకూ, దేశ భాష హిందీకి సరియైన గౌరవం హోద కల్పించాలని ప్రభుత్వానికి కోరారు. ఈ కార్యక్రమంలో భాషోపాధ్యాయులు చంద్రమోహన్, సాయిలు చారి, మల్లికార్జున్, పూర్ణ కృష్ణ, సంజీవులు, సంతోష్‌కుమార్, ప్రకాష్, రంజిత్ నాయక్, దుర్గయ్య, శ్రీనివాస్, అనిత, రజనీకుమారి, ప్రసన్నవాణీ, వెంకటేశ్వరి తదితరులు పాల్గొన్నారు. వీరందరు మాట్లాడుతూ ఇప్పటికైన భాషోపాధ్యాయులకు పదోన్నతులు కల్పించాలని లేని పక్షంలో రాష్ట్ర పండిత జెఎసి పిలుపుమేరకు ఉద్యమాన్ని మరింత తీవ్రం చేస్తామన్నారు.


అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పిస్తున్న దృశ్యం

## ప్రోటోకాల్ ఉల్లంఘించిన అధికారులపై చర్యలకు డిమాండ్

**-జిల్లా కాంగ్రెస్ కిసాన్ సెల్ అధ్యక్షులు**

**పాపన్నపేట, ఫిబ్రవరి 4, ప్రభాతవార్త:** ఏడుపాయల వనదుర్గా భవాని మాత ఆలయంలో మహాశివరాత్రి పర్వదినాలను పురస్కరించుకుని నిర్వహించే జాతర వాల్ పోస్టర్‌లో పట్టభద్రుల ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ఫోటోను పెట్టకపోవడం పట్ల కాంగ్రెస్ నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. ప్రోటోకాల్ ఉల్లంఘించిన ఆలయ అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రమైన పాపన్నపేటలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో మెదక్ జిల్లా కాంగ్రెస్ కిసాన్ సెల్ అధ్యక్షులు, ఎల్లాపూర్ సర్పంచ్ పబ్బతి ప్రభాకర్‌రెడ్డి, పాపన్న పేట ఎంపిటిసి సభ్యులు ఆకుల శ్రీనివాస్‌లు మాట్లాడుతూ పవిత్ర, పుణ్యక్షేత్రమైన వనదుర్గా భవాని మాత జాతరను పురస్కరించుకుని ఏర్పాటు చేసిన వాల్ పోస్టర్, ఆహ్వాన పత్రికల్లో మెదక్ నుంచి శాసన మండలిలో ప్రతినిధ్యం వహిస్తున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ఫోటో, పేరు లేకుండా ప్రచురించడం ఏమిటని వారు ప్రశ్నించారు. ఆలయ అధికారులపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. గత సారి సైతం ఇలాగే చేస్తే ఎమ్మెల్యే, ఆలయ అధికారుల దృష్టికి తీసుకుపోతే తప్పు జరిగిపోయింది, మరో మారు ఇలాంటి తప్పులు దొర్లకుండా జాగ్రత్త పడతామని హామి చేసి తమను శాంతిపచేసిన తిరిగి మరో మారు అలాంటి తప్పు చేయడంతో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, జిల్లా కలెక్టర్‌లకు ఫిర్యాదు చేయనున్నామని వివరించారు.

## జిల్లాలో పలు పోలీసు స్టేషన్లకు శాశ్వత భవనాల నిర్మాణాలు

**మంత్రి హరీష్‌రావు**

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి :** జిల్లాలోని పలు పోలీసు స్టేషన్లకు శాశ్వత భవనాలు నిర్మించడానికి రూ.27 కోట్ల 87 లక్షల నిధులు మంజూరు వచ్చినట్లు రాష్ట్ర అర్థిక, అరోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీష్‌రావు తెలిపారు. శనివారం అయన మాట్లాడుతూ జిల్లా పోలీసు కమిషనరేట్‌లో పోలీసు శాఖ ప్రజా రక్షణ, శాంతి భద్రతలను కాపాడటంలో ఇతరులకు అదర్శంగా నిలుస్తుందన్నారు. శిథిలావస్థకు చేరుకున్న పోలీసు స్టేషన్లకు శాశ్వత భవనాలు నిర్మించడం జరుగుతుందన్నారు. అన్ని పోలీసు స్టేషన్లు, ఏసీపీ కార్యాలయాలు మోడల్ కార్యాలయాలుగా నిర్మించడం జరుగుతుందన్నారు. హుస్నాబాద్ ఏసీపీ కార్యాలయ శాశ్వత భవన నిర్మాణానికి రూ. 2 కోట్ల 84 లక్షలు ,గజ్వేల్ ఏసీపీ కార్యాలయానికి, కమాండ్ కంట్రోల్ రూం నిర్మాణాలకు రూ. 2 కోట్ల 84 క్షలు గౌరారం సర్కిల్ కార్యాలయంకు రూ. 1 కోటి 73 లక్షలు, ములుగు పోలీసు స్టేషన్ భవన నిర్మాణానికి రూ. 3 కోట్ల 86 లక్షలు, గౌరారం పోలీసు స్టేషన్ భవన నిర్మాణానికి రూ. 3 కోట్ల 86 లక్షలు, కుకునూర్‌పల్లి పోలీసు స్టేషన్ నూతన భవన నిర్మాణానికి రూ.3 కోట్ల 86 లక్షలు, సిద్దిపేట పట్టణంలో టూ టౌన్, 3 టౌన్ పోలీసు స్టేషన్ల భవన నిర్మాణాలకు రూ.8 కోట్ల 88 లక్షలు మొత్తం 27 కోట్ల 87 లక్షలతో శాశ్వత భవనాలు మోడల్‌గా నిర్మిస్తున్నట్లు తెలిపారు. త్వరలోనే టెండర్ల ప్రక్రియ పూర్తి చేసి పనులు ప్రారంభించాలని సంబంధిత అధికారులను అదేశించినట్లు మంత్రి వివరించారు.

## అంగన్‌వాడీ కేంద్రంలో హాజరు శాతం తక్కువగా ఉండకూడదు

**-జిల్లా సంక్షేమ అధికారి బ్రహ్మాజీ**

**కౌడిపల్లి, ఫిబ్రవరి 4, ప్రభాతవార్త:** జిల్లాలో కొనసాగుతున్న అంగన్‌వాడి కేంద్రాలల్లో హాజర్ శాతం తక్కువగా ఉండకుండా కార్యకర్తలు తగు చర్యలు తీసుకొవాలిని జిల్లా సంక్షేమ అధికారి బ్రహ్మాజీ పేర్కొన్నారు. శనివారం నాడు మండల పరిధిలోని మహమ్మద్ నగర్ గ్రామంలో కల అంగన్‌వాడి కేంద్రాన్ని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా అంగన్‌వాడి కేంద్రంలో నిలువ ఉన్న పౌష్టికాహార బస్తాలను, రికార్డులను ఆమె పరిశీలించారు. అంగన్‌వాడి భవనం శిథిలావస్థలో ఉన్నట్లు గమనించి, విద్యార్థుల హాజర్ పట్టికను పరిశీలించి ఆమె అసంతృప్తిని వ్యక్తం చేశారు. బోజన, వంటకాలను మరింత నాణ్యతగా తయారు చేయాలని ఆమె అంగన్‌వాడి కార్యకర్తకు సూచించారు. కేంద్రంలో పిల్లల హాజర్‌శాతం తక్కువగా ఉండటానికి గల కారణాలు తెలుసుకున్నారు. ఏదిఏమైనా కేంద్రంలో విద్యార్థులు హాజర్ తక్కువగా ఉండ కూడదని, వారి ఇండ్ల వద్దకు ఆయాను పంపించి వెంటబెట్టుకు తీసుకువచ్చేలా చర్యలు తీసుకోవాలని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈమె తోపాటు ఆకౌంటెంట్ మహేశ్ గౌడు, అంగన్‌వాడి కార్యకర్త తదితరలు పాల్గొన్నారు.


అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీస్తున్న బ్రహ్మాజీ

# పేదల అడ్డాలో షావుకార్ల మకాం!?

## అమరుల స్థూపం విక్రయంపై ప్రజాసంఘాల ఆరా

హుస్నాబాద్, ఫిబ్రవరి 4,ప్రభాతవార్త

ప్రజల కనుసన్నల్లో చిరస్థాయిగా ఉండేలా పోరాటాలకు చైతన్యాన్ని రగిలిస్తూ చిరస్మరణీయంగా ఉండాలని కాంక్షించి నిర్మించిన హుస్నాబాద్ అమరువీరుల స్థూపాన్ని నిర్బంధం నీడన ప్రభుత్వం తరపున పోలీసులు విధ్వంసం చేయగా ఇప్పుడు మాజీ సానుభూతిపరులుగా చెప్పుకుంటూ కాలం వెల్లదీస్తున్న వారి అండదండలతో స్థూపం స్థలంలో పట్టణంలోని షావుకార్లు అంటే బడావ్యాపారులు మకాం వేసి చోద్యం తిలకిస్తున్నట్లు అర్థమవుతోంది. సంపూర్ణంగా స్థూపం అన్యాంక్రాంతం అయ్యేందుకు తోడ్పడిన తీరును సంపూర్ణంగా మావోయిస్టు పార్టీకి చేరవేసేందుకు అనుబంధంగా ఉంటున్న ప్రజాసంఘాలు పాటుపడుతున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఈ విషయంపై సేకరించిన సమాచారం ప్రకారం స్థూపం అడుగును కొల్లగొట్టేందుకు అలాగే రియల్‌మాఫియాకు అంటగట్టేందుకు మధ్య దళారీలుగా పట్టణానికి చెందిన ఒక రవాణాశాఖకు చెందిన ప్రభుత్వ ఉద్యోగితో పాటు మరో తహసీల్ కార్యాలయానికి చెందిన మాజీ ఉద్యోగి తమవంతు సంపూర్ణంగా సహకారం అందించినట్లు వినికిడి. అనంతరం పట్టణంలోని బడా వ్యాపారాలు కలిగిన సూపర్‌మార్కెట్ వ్యాపారాలు నిర్వహించే షావుకార్లతో పాటు మరికొంత మంది బడావ్యాపారులు ఇందులో భాగస్వాములుగా ఉన్నట్లు సమాచారం. వీరికి వెన్నుదన్నుగా ఉంటామని నమ్మబలుకుతూ అప్పటి ఉద్యమ కాలంలో కొందరు మాజీ మిలిటెంట్లుగా చెప్పుకుంటున్న వారు కూడా ఉన్నట్లు తెలిసింది. వీరికి తోడు హుస్నాబాద్ ప్రాంతానికి చెందిన ఒక జిల్లా స్థాయి ప్రజాప్రతినిధి ఉన్నట్లు పుకార్లు వినవస్తున్నాయి. మరో జిల్లా స్థాయి ప్రాజాప్రతినిధి కుటుంబీకులు ఒకరు రియల్ భూముల మార్కెటింగ్ వ్యవహారం చూసుకోనున్నట్లు తెలిసింది. హుస్నాబాద్ పట్టణంలో ఆసియాఖండంలోనే అతి పెద్దదైన రెండవ అతిపెద్ద స్థూపంగా పేరుగాంచిన హుస్నాబాద్ అమరవీరుల స్థూపంను వీక్షించేందుకు ప్రముఖ రచయిత కెన్యా దేశం నుండి గూగీయావాథింగోతో పాటు మనదేశానికి చెందిన పోరాటవీరులు కశ్మీర్‌కు చెందిన యాసిన్‌మాలిక్‌లు వచ్చి పోరాట లాల్‌సలామ్‌లు తెలిపారు. ఇలాంటి చిరస్మరణీయమైన అమరవీరుల స్థూపాన్ని ఆనవాళ్ళు లేకుండా చేయడంలో కుట్రను భగ్నం చేసే విషయంలో తమ వంతు పాత్రను పోషించేందుకు ప్రయత్నంగా అడుగులు ముందుకు వేయాలని కుట్రలను తేటతెల్లం చేసేందుకు ప్రజాసంఘాలు నడుంబిగించాయి. రియల్ మాఫియాకు దక్కేలా పట్టణానికి చెందిన ఒక ఎరువుల వ్యాపారితో పాటు హైదరాబాద్‌లోని రియల్‌వ్యాపారి ప్రధానపాత్ర పోషించేలా రవాణశాకు చెందిన ఒక ఉద్యోతితో పాటు తహసీల్‌శాఖకు చెందిన ఒక మాజీ సిబ్బంది ప్రధానపాత్రను పోషించినట్లు ప్రజాసంఘాలు సమాచారాన్ని సేకరించాయి. స్థూపం స్థల విక్రయం విషయంలో ప్రజాసంఘాలు తీవ్రంగా ఆగ్రహంగా ఉన్నట్లు తెలిసింది. మావోయిస్టు పార్టీ అగ్రనాయకత్వానికి చేరవేసేందుకు వారు పాటుపడుతున్నట్లు అందిన సమాచారం మేరకు తెలిసింది. ఈ స్థూపం విషయంలో చదును చేసే పనులను ప్రారంభించిననా డే పనులను ఆపివేయించిన హుస్నాబాద్ తహసీల్దార్ పను లను ఎందుకు ఆపించారు. మరలా ఎందుకు మొదలు పెట్టించారనే విషయంపై కూడా ప్రజాసంఘాలు ఆరా తీసినట్లు సమాచారం. పనుల విషయంలో తహసీల్దార్‌తో రియల్టర్లు కుమ్మక్కు కావడంపై పలు అనుమానాలకు తావిస్తున్నాయి. ఈ విషయంపై గతంలో హుస్నాబాద్ మావోయిస్టు దళనాయకుడిగా బాధ్యతలు నిర్వర్తించిన ధర్మల మల్లిఖార్జున్ అలియాస్ శ్రీనివాస్ హుస్నాబాద్ ప్రాంతంలోని వారిని దళం వద్దకు పిలిపించుకున్న క్రమంలో హుస్నాబాద్ స్థూపం విధ్వంసంపై వ్యాఖ్యానిస్తూ మరలా పునర్నించాలని ప్రస్తావించి ప్రయత్నాలను సైతం చేసినట్లు వారి మాటల్లో తెలిసింది. అనంతర ధర్మల మల్లిఖార్జున్ అలియాస్ శ్రీనివాస్ ఎదురుకాల్పుల్లో మృతిచెందగా అప్పటి నుండి మావోయిస్టు పార్టీ హుస్నాబాద్ అమరవీరుల స్థూపంపై ఎలాంటి ప్రకటనలు చేయలేదు. ప్రస్తుతం అమరవీరుల స్థూపం 'రియల్'పరమైందనే సమాచారం మేరకు ఎలాంటి ప్రకటనలు చేస్తుందో బాధ్యులపై ఎలాంటి చర్యలు తీసుకుంటుందో ఎలా స్పందిస్తుందో కాలం సమాధానం చెపుతుంది.



హుస్నాబాద్ స్థూపం అడుగు స్థలాన్ని చదును చేసిన దృశ్యం



విద్యార్థినులకు చట్టాలపై అవగాహన కల్పిస్తున్న మల్లేషం

## విద్యార్థినులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

**షీటీం సిబ్బంది ఇంచార్జి ఏఎస్ఐ మల్లేశం**

హుస్నాబాద్, ఫిబ్రవరి4, ప్రభాతవార్త

సమాజలో పెచ్చరిల్లి పేట్రేగిపోతున్న అనర్థాలకు సబంధించి అలాగే ఆడపిల్లల హక్కులను కాలరాస్తూ ఇంకా వారిని అమ్మాయిలను అక్రమరవాణ చేస్తూ అసాంఘిక కార్యకలాపాల్లోకి ముగ్గులోకి దించుతున్న అంశాలపై శనివారం హుస్నాబాద్ కస్తూర్బాగాంధీ విద్యాలయంలో పోలీస్ శాఖ అవగాహన కల్పించింది. ఈ కార్యక్రమం సిద్దిపేట పోలీస్‌కమిషనర్ ఆదేశాలమేరకు నిర్వహిస్తున్నామని షీటీమ్ సిబ్బంది ఇంచార్జి ఏఎస్ఐ మల్లేశం వెల్లడించారు. అమ్మాయిల అక్రమరవాణాలతో పాలు బాల్య వివాహాల నిర్మూలన, రక్షణకు సంబంధించిన ఇతర చట్టాల గురించి సవివరాంగా విద్యార్థినులకు వివరిస్తూ అవగాహన కల్పించారు. ప్రధానంగా తమ షీటీంలు కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా బాలబాలికల రక్షణ, విద్యార్థుల భద్రతతో పాటు రక్షణ కోసం పనిచేస్తున్నాయని వివరించారు. ఎవరైనా అకతాయిలు అమ్మాయిలను వేధింపులకు గురిచేసిన పక్షంలో మానసికంగా, శారీరకంగా హింసించినా అమ్మాయిలు ఇచ్చిన సమాచారం మేరకు వారిని అదుపులోకి తీసుకుని కౌన్సిలింగు నిర్వహించి శిక్షించడం జరుగుతుందని చెప్పారు. పాఠవాలలు, కళాశాలలకు వెళ్ళే అమ్మాయిలు ఇలాంటి వారిపట్ల చాలా అప్రమత్తంగా వ్యవహరించాలని వారికి ధైర్యం నూరిపోసారు. రహదారిపై వెళుతున్న సమయంలో అమ్మాయిలను అవహేళనగా, ఉద్దేశ్యపూర్వకంగా మాట్లాడే సందర్భంగా తక్షణమే 100నెంబరుకు డయల్ చేసి సమాచార ఇవ్వాలని లేదా సిద్దిపేట కమిషనరేట్‌లోని నెంబరు 9494639498, 83333998699, 7901640473లకు డయల్ చేసి సమాచారం తెలపాలని మల్లేశం సూచించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయు రాలు మమత, పోలీస్‌శాఖకు చెందిన మహిళాకానిస్టేబుల్ రజిత, కానిస్టేబుల్ దుద్యా నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## బిజెపి బలోపేతానికి కృషి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న పంజాల అశోక్‌గౌడ్

గజ్వేల్, ఫిబ్రవరి 4 (ప్రభాతవార్త):

బిజెపి బలోపేతానికి కార్యకర్తలు కృషి చేయాలని మండల అధ్య క్షుడు పంజాల అశోక్‌గౌడ్ పిలుపునిచ్చారు. శనివారం గజ్వేల్ పట్టణంలోని బిజెపి పార్టీ కార్యాలయంలో మండల కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గజ్వేల్ మండలంలోని ప్రతి గ్రామంలో బూత్ స్థాయి నుండి పార్టీని బలోపేతం చేయాలని, బిజెపి పార్టీ ఎదుగుదలకు ప్రతి కార్యకర్త కష్టపడాలన్నారు. గజ్వేల్ గడ్డపై కాషాయ జెండా ఎగురవేయడమే లక్ష్యంగా పనిచేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర నాయకుడు, మండల ఇన్‌ఛార్జి ఎల్లు రాంరెడ్డి, రాష్ట్ర నాయకులు గురువారెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ సాయి, కో-కన్వీనర్లు సురేష్, మహేష్, మండల నాయకులు రాజు, వెంకట్‌గౌడ్, స్వామి, నవీన్, రమాకాంత్, రమేష్‌గౌడ్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

## అక్రమంగా బనాయించిన కేసులు వెంటనే ఎత్తివేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ప్రశాంత్

సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి :

కానిస్టేబుల్, ఎస్ఐ అభ్యర్థులు న్యాయం చేయాలని కోరుతూ అసెంబ్లీ ముందు తమ గోడును వెల్లబోసుకోవడానికి వెళ్లితే ప్రభుత్వం అభ్యర్థులపై కేసులు బనాయించడం సరికాదని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి దాసరి ప్రశాంత్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు రెడ్డమైన అరవింద్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో అయన పాల్గొని మాట్లాడారు. కానిస్టేబుల్, ఎస్ఐ అభ్యర్థులపై అక్రమంగా బనాయించిన కేసులు వెంటనే బేషరతుగా ఎత్తివేయాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా పోలీసు అభ్యర్థులకు తీరని అన్యాయం జరిగిందని అన్ని జిల్లాలో నిరసనలు తెలుపుతున్నారని తెలిపారు. ఈ క్రమంలో అసెంబ్లీ ముందు తమ గోడును తెలపడానికి వెళ్తే పోలీసులు వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయడం మంచి పద్దతి కాదన్నారు. అభ్యర్థులపై పెట్టిన కేసులు వెంటనే ఎత్తి వేయాలని లేని పక్షంలో అందోళనలు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు కొండం సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ పార్టీకి ప్రజలే తగిన బుద్ది చెబుతారు

**సింగాయిపల్లి గోపి, వాల్దాస్ మల్లేష్‌గౌడ్**

నర్సాపూర్, ఫిబ్రవరి 4.ప్రభాతవార్త:

రానున్న ఎన్నికల్లో టిఆర్ఎస్ పార్టీకి ప్రజలే తగిన బుద్ది చెబుతారని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సింగాయిపల్లి గోపి, నర్సాపూర్ బిజెపి కన్వీనర్ వాల్దాస్ మల్లేష్‌గౌడ్ లు అన్నారు. శనివారం నర్సాపూర్‌లోని బిజెపి పార్టీ కార్యాలయంలో బిజెపి నర్సాపూర్ శాఖ అధ్వర్యంలో విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈసమావేశానికి బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సింగాయిపల్లి గోపి, నర్సాపూర్ బిజెపి కన్వీనర్ వాల్దాస్ మల్లేష్‌గౌడ్ లు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ టిఆర్ఎస్ పార్టీ ఎన్నికలసమయంలో సిఎం కెసిఆర్ ప్రజలకిచ్చిన హామీలను అమలు చేయడం లేదన్నారు. బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సింగాయిపల్లి గోపి, నర్సాపూర్ బిజెపి కన్వీనర్ వాల్దాస్ మల్లేష్‌గౌడ్‌లతో పాటు బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి సురేష్, బిజెపి ఓబిసి జిల్లా అధ్యక్షులు పాప గారి చిన్నరమేశ్‌గౌడ్, బిజెపి జిల్లా అధికార ప్రతినిధి శ్రీనివాస్‌గుప్త, నర్సా పూర్ బిజెపి పట్టణ అధ్యక్షులు ఆంజనే యులుగౌడ్, నాయకులు బాల్‌రె డ్డి, గుండం శంకర్, నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నర్సాపూర్ బిజెపి నాయకులు



రాజీవ్ రహదారిపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

## క్యాన్సర్ వ్యాధి పట్ల అప్రమత్తత అవసరం

**సూరజ్ సంస్థ ప్రాజెక్టు మేనేజర్ అమిత్‌కుమార్**

వర్గల్, ఫిబ్రవరి 4 (ప్రభాతవార్త):

భయంకరమైన క్యాన్సర్ వ్యాధిని ముందుచూపు, అప్రమత్తతతోనే నివారించవచ్చని గ్రీన్ లైఫ్ హాస్పిటల్ వైద్యులు డాక్టర్ దేవేందర్, సూరజ్ బిల్డ్ కాన్ ప్రైవేట్ లిమిటెడ్ ప్రాజెక్టు మేనేజర్ అమిత్‌కుమార్, సేఫ్టీ మేనేజర్ కేసీ షాజి, ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ కిరణ్‌కుమార్‌లు స్పష్టం చేశారు. ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా శనివారం గౌరారం రాజీవ్ రహదారిపై కార్మికులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ప్రముఖ కంపెనీ వద్ద నిర్వహించిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ క్యాన్సర్ రహిత సమాజ నిర్మాణం లక్ష్యంగా తమ సంస్థ అన్ని రకాలుగా చేయూత అందిస్తుందని పేర్కొన్నారు. మంచి జీవన విధానం, మంచి ఆహారపు అలవాట్లతో క్యాన్సర్ వ్యాధికి దూరంగా ఉండవచ్చని తెలిపారు. కార్మికులు పొగాకు, తంబాకు, సిగరెట్లకు దూరంగా ఉండాలని, మద్యం అలవాట్లు మానుకోవాలని సూచించారు. వయసుతో సంబంధం లేదని, మానవ శరీరంలోని అన్ని భాగాలకు క్యాన్సర్ గర్భాశయ, పెద్దపేగు, థైరాయిడ్, కిడ్నీ, కాలేయం, ఊపిరితిత్తులు, మూత్రాశయం తదితర అవయవాలకు క్యాన్సర్ సోకే ప్రమాదం ఉందని అన్నారు. విపరీతమైన అలసట, ఆకలి తగ్గడం, మూత్రవిసర్జన సమయంలో నొప్పి, మూత్రంలో రక్తం తదితర ఆరంభ సమయంలో కనిపిస్తాయని చెప్పారు. చెడు అలవాట్లు లేనప్పటికీ కూడా వంశపారంపర్యంగా కూడా క్యాన్సర్ వ్యాధి సోకే ప్రమాదం ఉందని వివరించారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## క్రీడలను ప్రోత్సహించడం లక్ష్యం

**అధ్యక్షులు మొఖీమ్**



ఫుడ్‌బాల్ క్రీడలను ప్రారంభిస్తున్న అధ్యక్షులు మొఖీమ్

**సంగారెడ్డి మున్సిపాలిటి ఫిబ్రవరి 4 ప్రభాతవార్త:** క్రీడల్లో యువతను ప్రోత్సహించడమే తమ సంస్థ ముఖ్య లక్ష్యమని మనబిన్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు ఎం.ఎ.మొఖీమ్ అన్నారు. శనివారం సంగారెడ్డిలోని అంబేద్కర్ స్టేడియంలో మనబిన్ ఫౌండూషన్ ఫుడ్‌బాల్ కప్ 2023, రాష్ట్రస్థాయి ఫుడ్‌బాల్ టోర్నమెంట్‌ను అయన ప్రారంభించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఇప్పటికే వివిధ పట్టణాలలో క్రీడ పోటీలు నిర్వహించడం జరిగిందని అన్నారు. వివిధ విభాగాలలో ఆసక్తి ఉన్న క్రీడకారులకు, ప్రోత్సహించేందుకు, వారిలోని క్రీడప్రతిభను గుర్తించేందుకు ఇలాంటి క్రీడాపోటీలు దోహదపడతాయని అన్నారు. త్వరలోనే సంగారెడ్డిలో క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిం చడం జరుగుతుందని అన్నారు. ఈటోర్నమెంట్‌లో సంగారెడ్డిజిల్లాతో పాటు, హైద రాబద్, రంగారెడ్డి, మేడ్చల్, బిదర్ వివిద జిల్లాలకు చెందిన ఫుడ్‌బాల్ టీమ్‌లు పాల్గొంటున్నాయని అన్నారు. టోర్నమెంట్‌లో పాల్గొనే క్రీడకారులకు, భోజన వసతి కూడ ఏర్పాటు చేశామని అన్నారు. ఇక ముందు కూడ ఇలాంటి టోర్నమెంట్లు నిర్వ హిస్తామని ఎం.ఎ.మొఖీమ్ అన్నారు. అనంతరం క్రీడకారులను పరిచయం చేసు కొని, ఫుడ్‌బాల్‌ను పాస్‌చేసి టోర్నమెంట్‌ను ప్రారంబించారు. అంతకు ముందు జ్యోతి ప్రజ్వలన కార్యాక్రమం నిర్వహించారు. కార్యాక్రమంలో ఆర్గనైజర్లు మొహమ్మద్ షఫీయోద్దిన్, అబెద్‌బిన్ మొసిన్, మోహమ్మద్ ఖాలిఖ్, నోమాన్, మొహమ్మద్ అక్బర్, మొహమ్మద్ ఫారుఖ్, మొహమ్మద్ షైబార్‌ఖులతో పాటు నాయకులు ఇటియస్ షఫీ, మొహమ్మద్ ఉస్మాన్, శంకర్‌రెడ్డి, యాఖుబ్‌అలీ, వికాస్, మహబూబ్‌అలీ, తాహెర్ తదితరులు పాల్గొన్నారు.

## ఆలయ వార్షికోత్సవానికి రావాలి

కొల్చారం, ఫిబ్రవరి4 ప్రభాతవార్త:

హుజురాబాద్ శాసన సభ్యులు ఈటెల రాజేందర్‌ను శనివారం శామీర్‌పేటలోని తన నివాసం మర్యాద పూర్వకంగా కలిసి కొల్చారం మండలం రాంపూర్ గ్రామంలో ఈ నెల 8, 9, 10వ తేదీలలో జరగనున్న పెద్దమ్మ తల్లి ఆలయ మొదటి వార్షికోత్సవంకు రావలసిందిగా ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల బీజేపీ అధ్యక్షులు పాతూరి దయాకర్‌గౌడ్, రాంపూర్ బీజేపీ బూత్ అధ్యక్షులు డాకం యాదగిరి, రాంపూర్ ముదిరాజ్ సంఘం అధ్యక్షులు ఆకుల మధు ముదిరాజ్, ఎల్లయ్య, ఏగొండ తదితరులు పాల్గొన్నారు.



ఈట రాజేందర్‌కు ఆహ్వాన పత్రికను అందజేస్తున్న దృశ్యం



సిఎం కెసిఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న దృశ్యం

## స్వరాష్ట్ర సాకార ఫలితమే..కాళేశ్వరం జలాలు

తొగుట, ఫిబ్రవరి 4, ప్రభాతవార్త:

స్వరాష్ట్ర సాకార ఫలితంతోనే కాళేశ్వరం జలాలు వచ్చాయని..కాళేశ్వరం నీళ్లతో దుబ్బాక నియోజకవర్గం సస్యశ్యామలం అవుతుందని మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు జీడిపల్లి రాంరెడ్డి అన్నారు. మండల పరిధిలోని చందాపూర్‌లో కూడవెల్లి వాగులో చెక్ డ్యాం మీదుగా మల్లన్నసాగర్ జలాలు శనివారం పరవళ్ల తొక్కుతుండగా మండల ప్రజాప్రతినిధులు, నాయకులతో కలిసి సిఎం కెసిఆర్ చిత్ర పటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం సాధించడంతోనే ఎక్కడో ఉన్న గోదావరి జిల్లాలు గ్రామాల్లోని చెరువులు, కుంటలు, వాగుల్లోకి వచ్చి చేరుతున్నాయన్నారు. ప్రతిపక్ష పార్టీలు చేస్తున్న అరోపణలకు కూడవెల్లి వాగులో ప్రవహిస్తున్న గోదావరి నీళ్లే సమాధానం చెబుతాయన్నారు. రైతు సంక్షేమమే ధ్యేయంగా బిఆర్ఎస్ సర్కారు ముందుకు సాగుతుందన్నారు. కూడవెల్లి వాగులోకి నీటిని విడుదల చేసిన సిఎం కెసిఆర్, మంత్రి తన్నీరు హరీష్‌రావు, ఎంపి కొత్త ప్రభాకర్‌రెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు. పిఎసిఎస్ చైర్మన్ కె.హరికృష్ణారెడ్డి, దోమల కొమురయ్య తదితరులు మాట్లాడారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు బొడ్డు నర్సింహులు, ఎల్పుల స్వామి, కంది రాంరెడ్డి, చిలువేరి మల్లారెడ్డి, బిక్కనూరి శ్రీశైలం, మంగ నర్సింహులు, మెట్టు స్వామి, చంద్రారెడ్డి, సుతారి రమేష్, బక్క కనకయ్య, గంట రవీందర్, దేదునూరి పోచయ్య, ఐలయ్య, నర్సింహులు, మల్లేశం, అనిల్, భాస్కర్‌గౌడ్, చెరుకు లక్ష్మారెడ్డి, అంజనేయులు, అరుణ్‌కుమార్, శ్రీనివాస్‌గౌడ్, కొంగరి మహేష్, రాంబాబు, సుభాష్, కర్ణాకర్ బొడ్డు భూమయ్య తదితరులు పాల్గొన్నారు.

### దుబ్బాక నియోజకవర్గం ఎంపితోనే సాధ్యం

దుబ్బాక నియోజకవర్గ అభివృద్ధి ఎంపి కొత్త ప్రభాకర్‌రెడ్డితోనే సాధ్యమవుతుందని మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు జీడిపల్లి రాంరెడ్డి అన్నారు. దుబ్బాక నియో జకవర్గంలోని ప్రతి గ్రామ పంచాయతీకి జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా సిఎం కెసిఆర్, మంత్రి హరీష్‌రావు సహకారంతో ఎంపి ప్రభాకర్‌రెడ్డి నియోజకవర్గంలోని ప్రతి గ్రామ పంచాయతీకి రూ.10 లక్షల నిధులు మంజూరు చేయించడం హర్షణీయమన్నారు. తొగుట మండల పరిధిలోని 17 గ్రామ పంచాయతీలకు పంచాయతీకి రూ.10 లక్షల చొప్పున రూ.1.70 కోట్ల నిధులు మంజూరు చేయించారని తెలిపారు. మండల పరిధిలోని గ్రామాల అభివృద్ధికి నిధులు మంజూరు చేయించిన సిఎం కెసిఆర్, మంత్రి హరీష్‌రావు, ఎంపి ప్రభాకర్‌రెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు.

## కూచిపూడి కళాకారిణి భవానికి డాక్టరేట్



డాక్టరేట్ అవార్డు అందుకుంటున్న భవాని

సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి :

సిద్దిపేటకు చెందిన కూచిపూడి కళాకారిణి గాడిచర్ల భవాని గౌరవ డాక్టరేట్ అవార్డును అందుకున్నారు. తమిళనాడు రాష్ట్రంలోని ఊటీలో గ్లోబల్ హ్యూమన్ పీస్ యూనవర్శిటీ అధ్వర్యంలో రిసోర్స్ సెంటర్ ఫర్ ట్రైబల్ కల్చర్ హాల్‌లో పలు రంగాలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన కళాకారులకు అవార్డులు అందజేశారు. టి.రాష్ట్రం నుంచి సిద్దిపేటకు చెందిన గాడిచర్ల భవానికి కూచిపూడి నృత రంగంలో ఉత్తమ ప్రతిభను కనబర్చడంతో గౌరవ డాక్టరేట్ అవార్డు అందుకున్నారు. కూచిపూడి నృత్యానికి జీవం పోస్తున్న భవానికి ఊటిలోని గ్లోబల్ హ్యూమన్ పీస్ యూనివర్శిటీ వైస్ ఛాన్సలర్, తమిళనాడు మాజీ న్యాయమూర్తి వెంకటేషన్, మాజీ స్పెషల్ కమిషనర్, ప్రిన్సిపల్ సెకాసంపత్‌కుమార్, కేరళ మాజీ డీజీపీ పులికేసిల చేతుల మీదుగా భవానికి గౌరవ డాక్టరేట్ అవార్డు అందజేశారు. గౌరవ డాక్టరేట్ అవార్డు దక్కడం పట్ల భవాని సంతోషం వ్యక్తం చేశారు. గౌరవ డాక్టరేట్ అవార్డు అందుకున్న భవానినికి పలవురు అభినందించారు. భవాని ఎంతో మంది విద్యార్థులకు కూచిపూడి, భరతనాట్యం లాంటి కళలలో శిక్షణ ఇస్తూ కళకారులుగా తీర్చిదిద్దుతుంది.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

**కొల్చారం, ఫిబ్రవరి4 ప్రభాతవార్త:** ఎదురుగా వస్తున్న టాటీ ఏసీ వాహనం ఢీకొనడంతో ద్విచక్ర వాహనంపై వెళ్తున్న వ్యక్తికి తీవ్ర గాయాలైన సంఘటన మండల కేంద్రమైన కొల్చారం గ్రామ శివారులో మెదక్-హైదరాబాద్ ప్రధాన రహదారిపై లోతువాగు మూల మలుపు వద్ద శనివారం చోటుచేసుకుంది. ఎస్ఐ శ్రీనివాస్‌గౌడ్ కథనం ప్రకారం కౌడిపల్లి మండలం దేవులపల్లి గ్రామానికి చెందిన నరసింహ అప్పాజిపల్లిలో తన అత్తగారి ఇంటికి వచ్చి ద్విచక్ర వాహనంపై వెళ్తున్న క్రమంలో ఎదురుగా వస్తున్న టాటా ఏసీ ఢీకొనడంతో తీవ్ర గాయాలయ్యాయి. దీంతో 108 అంబులెన్స్‌లో మెదక్ ఏరియా ఆసుపత్రికి తరలించగా, మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలించారు.

## తునికి ఆలయ కమిటీ ఏర్పాటుకు నోటిఫికేషన్

**కౌడిపల్లి, ఫిబ్రవరి 4, ప్రభాతవార్త:** మెదక్ జిల్లాలలోనే రెండవ అతిపెద్ద జాతరగా పేరుగాంచిన తునికి శ్రీ నల్ల పోచమ్మ ఆలయ పాలకవర్గ ఏర్పాటుకు దేవదాయశాఖ ఈ నెల నోటిఫికేషన్ విడుదల చేసినట్లు ఆలయ ఈఓ మోహన్ రెడ్డి శని వారం ఒక ప్రకటనలో తెలిపారు. దేవదాయ శాఖలో తునికి శ్రీ నల్ల పోచమ్మ ఆలయంను 2016లో ప్రభుత్వం విలీనం చేసింది. కాగా దేవదాయ ధర్మదాయ శాఖ అధీనంలో వచ్చిన మొదటి సారి అనగా 2017-18కి సంబంధించి ఆలయ కమీటి ఏర్పాటు జరిగింది. వారి పదవి కాలం పూర్తైన నాటి నుండి నాల్గు సంవత్సరాల వరకు కమిటీ ఏర్పాటు చేయలేక పోయింది. ఈ యేడు ఆలయ కమిటీ ఏర్పాటుకు ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేయడం పట్ల ఆశపర్లు అనందరం వ్యక్తం చేస్తున్నారు. తునికి ఆలయ కమిటీలో చైర్మెన్‌తో సహా ఎనిమిది మంది డైరెక్టర్లు ఉంటారని ఆయన తెలిపారు. ఉత్సహం ఉన్నవారు ఈ నెల 10వ తేదిలోపు తమ దరఖాస్తులను సం గారెడ్డి దేవాదాయ ధర్మదాయ శాఖ కారా ్యలయంలో సమర్పించాలని ఈఓ మోహా న్‌రెడ్డి తెలిపారు.



విరాళం అందజేస్తున్న దృశ్యంల

## దుర్గమ్మ ఆలయానికి విరాళం

నంగునూర్, ఫిబ్రవరి 4, ప్రభాతవార్త :

నంగునూర్ మండలం అక్కెనపల్లి గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న దుర్గమ్మ అలయానికి ఎంపిటిసి బెదురు తిరుపతి రూ.21,116 విరాళాన్ని శనివారం అలయ కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ వెంకటేశం, రైతుబంధు మండల అధ్యక్షులు బద్దిపడగ కృష్ణారెడ్డి, ఎఎంసి వైస్ చైర్మన్ తిప్పని నాగేందర్, అలయ కమిటీ సభ్యులు ఎంపిటిసి తిరుపతికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ జక్కిరెడ్డి సత్యనారాయణరెడ్డి, అలయ కమిటీ సభ్యులు పాతూరి వెంకట్‌రాంరెడ్డి, సంద యాదగిరి, సంద బాల్‌లింగం, గొర్ల ప్రభాకర్, గుడికందుల శ్రీనివాస్, తిప్పని రాజేశ్వర్, సిల్వేరి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా స్వయం పాలనా దినోత్సవం



డీఈవో, ప్రధానోపాధ్యాయులుగా వ్యవహరించిన విద్యార్థులు

సిద్దిపేట రూరల్, ఫిబ్రవరి 4, ప్రభాతవార్త :

జిల్లా కేంద్రంలోని భారత్‌నగర్ శ్రీవాణి టెక్నో స్కూల్‌లో విద్యార్థులు శనివారం స్వయం పాలనా దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. విద్యార్థులే ఉపాధ్యాయులుగా వ్యవహారించి తోటి విద్యార్థులకు చక్కటి బోధన చేసి ప్రశంసలు అందుకున్నారు. డీఈవోగా జె. శ్రీవైష్ణ వి, ప్రధానోపాధ్యాయులుగా ఎం.గణేష్, కరస్పాండెంట్‌గా డి.సాత్విక్‌లు వ్యవహారించారు. బి.రవళి, శశిధర్‌రెడ్డి, అర్.శివకుమార్, పి.దీపిక, కె.స్పందన, జె.అమూల్య తదితరులు ఉపాధ్యాయులుగా వ్యవహారించారు. ఈ సందర్భంగా ఉత్తమ ప్రతిభకనబరిచిన రవళి, కీర్తన, ప్రజ్ఞ, డి.చిన్నయి, వైష్ణవి, మన్విత‌రెడ్డి, స్వామి, సామ్యూల్, అభిలాష్‌కు పాఠశాల కరస్పాండెంట్ సి.హెచ్.సత్యం చేతుల మీదుగా బహుమతులు అందించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ కృపాకర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు దక్కిన అరుదైన గౌరవం



ప్రచురితమైన పేపర్లను చూపుతున్న ప్రిన్సిపల్ సూర్యప్రకాష్

సిద్దిపేట రూరల్, ఫిబ్రవరి 4, ప్రభాతవార్త :

జిల్లా కేంద్రంలోని ప్రతిభ డిగ్రీ, పీజీ కళాశాలలో ఎమ్మెస్సీ కంప్యూటర్ సైన్స్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు అరుదైన గౌరవం దక్కింది. ఎస్.రుతిక మెషిన్ లెర్నింగ్, డేటా మైనింగ్‌లో క్లస్టరింగ్ విభాగంలో అత్యధికంగా ఉపయోగిస్తున్న కేమీన్స్ క్లస్టరింగ్ అల్గారితంపై సమగ్ర పరిశీలన చేసి అల్గారితం ఎలా పని చేస్తుంది అలాగే ఉపయోగాలను పేర్కొన్నారు. అలాగే పి.నిరీక్షణ, సిహెచ్. శ్రావణి ఇద్దరు కలిసి మిషన్ లెర్నింగ్, డేటా మైనింగ్‌లో క్లాసిఫికేషన్ విభాగంలో అత్యధికంగా ఉపయోగిస్తున్నటువంటి ఎస్వీఎం క్లాసిఫికేషన్ అల్గారితం పైన సమగ్రమైన పరిశీలన చేసి అల్గారితంను ఏఏ విభాగాలలో ఉపయోగిస్తున్నారో పేర్కొన్నారు. రెండు పరి శోధన పత్రాలను ఇంటర్నేషనల్ జర్నల్ అఫ్ మల్టీ డిసిప్లినరీ ఎడ్యుకేషన్ అనే ఒక ప్రతిష్టాత్మకమైన జర్నల్‌కి పంపించగా 40 రోజులలో రెండు సార్లు పేపర్లను రివ్యూ చేసిన తర్వాత శనివారం జర్నల్‌లో రెండు పేపర్లు ప్రచురించినట్లు కళాశాల ప్రిన్సిపల్ సూర్యప్రకాష్ తెలిపారు. విద్యార్థులు పరిశోధన వైపు అలోచించి, సృజనాత్మకతతో కూడిన పరిశోధన వైపు దృష్టి సారించాలన్నారు. విద్యార్థుల విజయం కళాశాలకు గర్వకారణం అన్నారు.

## గంటంబోట్ల రవిప్రసాద్ శర్మకు డాక్టరేట్

కౌడిపల్లి, ఫిబ్రవరి 4, ప్రభాతవార్త: మెదక్ జిల్లా కౌడిపల్లి మండలంలోని వెల్మకన్నె గ్రామానికి చెందిన గంటంబోట్ల రవి ప్రసాద్ శర్మకు గత 16 సంవత్సరాలుగా వివిధ సామాజిక స్వచ్చంద సంస్థల ఆధ్వర్యంలో చేసిన సేవలకు గుర్తించి ఆసియా వేదిక్ కల్చరల్ రిసెర్చ్ యూనివర్సిటి మరియు స్ఫూర్తి సర్వీసెస్ సొసైటీ ఇండియా ఎన్జీవో సంస్థలు కలిసి ఆయనకు గౌరవ డాక్టరేట్ అవార్డును ప్రకటించారు. ఈ అవార్డును శనివారం నాడు హైదరాబాద్ తెలంగాణ సరస్వతి పరిషత్ డాక్టర్ సి. నారాయణ రెడ్డి ఆడిటోరియం, ఆబిడ్స్‌లో గౌరవ డాక్టరేట్ అవార్డును అందుకున్నారు.



డాక్టరేట్ అవార్డును అందుకుంటున్న దృశ్యం



ఎంఇఓ అంజయ్యకు ఉపాధ్యాయులు బదిలీ పత్రాలు అందచేస్తున్న దృశ్యం

## షురూవైన ఉపాధ్యాయుల బదిలీలు

**పుల్కల్, ఫిబ్రవరి 4, ప్రభాతవార్త:** ఉమ్మడి పుల్కల్ మండలంలోని ఆయా గ్రామాల్లోని పాఠశాలల్లో బాధ్యతలు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు తమ బదిలీల కోసం ధరఖాస్తులు చేసుకుంటున్నట్లు మండల విద్యాధికారి డి అంజయ్య పేర్కొన్నారు. ఎంఇఓ కథనం ప్రకారం... పుల్కల్ మండలంలోని ఆయా ప్రభుత్వ పాఠశాలలకు 140 మంది ఉపాధ్యాయ పోస్టులు మంజూరు కాగా 126 మంది ఉపాధ్యాయులు బాధ్యతలు చేపడుతున్నారన్నారు. 99 మంది ఉపాధ్యాయులు ఆన్‌లైన్లఓ బదిలీలకు ధరఖాస్తులు చేసుకున్నారన్నారు. 39 మంది ఉపాధ్యాయులను బదిలీ చేయాల్సి ఉందని, మండలానికి ఇతర ప్రాంతాల నుంచి 53 మంది ఉపాధ్యాయులు మండలానికి వచ్చే అవకాశం ఉందన్నారు.

**చౌటకూరు మండలంలో...**

చౌటకూరు మండలంలోని ఆయా పాఠశాలల్లో 102 మంది ఉపాధ్యాయులు పనిచేస్తుండగా 6 పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. 61 మంది ఉపాధ్యాయులు బదిలీల కోసం ఆన్‌లైన్‌లో ధరఖాస్తులు చేసుకున్నారని, 30 మంది ఉపాధ్యాయులను బదిలీ చేయాల్సి ఉందని, మండలానికి 36 మంది ఉపాధ్యాయులు బదిలీపై వచ్చే అవకాశాలు ఉన్నాయని ఎంఇఓ డి అంజయ్య వివరించారు.

### యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడికి సన్మానం



యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిని సన్మానిస్తున్న దృశ్యం

**చౌటకూరు, ఫిబ్రవరి 4, ప్రభాతవార్త:** చౌటకూరు మండల యూత్ కాంగ్రెస్ నాయకులను మండలంలోని సుల్తాన్‌పూర్ గ్రామ కమిటి అధ్యక్షులు మంగలి మహేష్, బిసి సెల్ ఉపాధ్యక్షులు కళాలి మహేష్‌గౌడ్‌ల ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు దానంపల్లి సుధాకర్, ఉపాధ్యక్షులు మహేందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి చంటి రమేష్‌లను పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గొల్ల మహేష్, మన్నే వినయ్‌కుమార్, కొడకంటి ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

### క్రీడాకారులను అభినందించిన నాయకులు



క్రీడాకారులను అభినందిస్తున్న దృశ్యం

**ఝరాసంగం, ఫిబ్రవరి 4, ప్రభాతవార్త:** క్రికెట్ టోర్నిని సాధించిన క్రికెట్ జట్టు క్రీడాకారులను చీలెపల్లి గ్రామస్థులు అభినందించారు. గ్రామానికి మొదటి మారు ట్రోఫి వచ్చేలా కృషి చేసిన క్రీడాకారులను ప్రజాప్రతినిధులు, నాయకులు, గ్రామ పెద్దలు ప్రత్యేకంగా అభినందించారు. క్రీడాకారులకు క్రికెట్ కిట్ అందించి ఆటలో ప్రతిభ కనబర్చేలా కృషి చేసిన పురం మల్లారెడ్డి, ఎండి ఆరిఫ్‌లకు క్రీడాకారులు కృతజ్ఞతలు తెలిపారు. టోర్ని కప్పును సాధించేలా జట్టును నడిపించిన క్రికెట్ జట్టు కేప్టెన్ మొగులప్ప, శ్రీనివాస్, ప్రభాకర్, డానియల్‌లను సిద్దాపూర్ గ్రామ సర్పంచ్ సంగారెడ్డి, ఎంపిటిసి సభ్యులో మొహమ్మద్ ఆఫీజ్, గ్రామస్థులు బద్రరెడ్డి, సంజీవరెడ్డి, టోర్నమెంట్ ఆర్గనైజర్ ఎండి హుస్సేన్ మొల్సాబ్‌లు ప్రత్యేకంగా అభినందించారు.

## కార్మికుల సమస్యలకై అలుపెరుగని పోరాటం

**ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి బోయిని ప్రసాద్**

**గుమ్మడిదల, ఫిబ్రవరి 4, ప్రభాతవార్త:**

ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి బోయిని ప్రసాద్ గుమ్మడిదలలో జరిగిన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడుతూ గత 30, 40 సంవత్సరాలుగా మధ్యాహ్న భోజన కార్మికల సమస్యలపై ఏఐటియుసి ఆధ్వర్యంలో అలుపెరుగని పోరాటాలు చేస్తూ 1000 నుండి 3000 రూపాయల వరకు మధ్యాహ్నం భోజన కార్మికులకు గౌరవ వేతనం పెంచుకోవడం జరిగింది, పెంచిన గౌరవ వేతనం 2022 సంవత్సరము ఏప్రిల్ 20 వ తేదీ నుండి అమల్లోకి వచ్చిందని తెలియజేశారు. కెసిఆర్ ప్రభుత్వానికి సంగారెడ్డి ఏఐటియుసి జిల్లా కమిటీకి కృతజ్ఞతలు తెలుపుకుంటున్నది, అలాగే మన ఊరు-మన బడి లో అటెండర్స్, స్లీపర్స్ లేరని, అది గమనించి తక్షణమే అటెండర్స్, స్లీపర్స్ లేరు అది గమనించాలని తక్షణమే అటెండర్స్‌ని స్వీపర్సుని స్కావెంజర్సుని తిరిగి విధుల్లోకి తీసుకోవాలని వారికి 2000 రూపాలు కాకుండా 10,500 రూపాయలు ఇచ్చేలా కెసిఆర్ ప్రభుత్వము తక్షణం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. మన ఊరు-మన బడిలో పనిచేస్తే కార్మికులకు ఈఎస్ఐ, పిఎఫ్, ఇన్సూరెన్స్ లాంటి సౌకర్యాలు కల్పించాలని వారికి భద్రత కల్పించాలని ఆయన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సహాయ కార్యదర్శులు బి లక్ష్మి, జి మాధవి తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా కోర్టు కాంప్లెక్స్‌లో కంటి వెలుగు క్యాంపు

**సంగారెడ్డి బ్యూరో, ఫిబ్రవరి 4, ప్రభాతవార్త:**

జిల్లా కోర్టు కాంపెక్స్‌లో శనివారం కంటి వెలుగు శిబిరాన్ని ఏర్పాటు చేసి న్యాయమూర్తులు, న్యాయవాదులు, కోర్టు సిబ్బందికి కంటి పరీక్షలు చేసినట్లు జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ గాయత్రిదేవి తెలిపారు. ఇట్టి కంటి వెలుగు శిబిరాన్ని ఫసస్ట అడిషనల్ డిస్టిక్ట్ అండ్ సెషన్స్ జడ్జ్ జి సుదర్శన్ ప్రారంభించి, కంటి పరీక్షలు చేసుకున్నారని తెలిపారు. ఇట్టి శిబిరంలో మొత్తం 153 మందికి కంటి పరీక్షలు చేసినట్లు తెలిపారు. అందులో 48 మందికి రీడింగ్ గ్లాసెస్ అందజేశామన్నారు. 39 మందికి ప్రిస్క్రిప్షన్ గ్లాసులు అవసరమని గుర్తించారని, 52 మందికి సర్జరీ కోసం సిఫారసు చేసినటు ఆమె పేర్కొన్నారు. ఇట్టి కార్యక్రమంలో కంటి వెలుగు ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ భాస్కర్, డా శశికర్, సిబ్బంది పాల్గొన్నారు.

**యువ భారత ఆకాంక్షలను పటిష్టం చేసిన కేఈఐవైర్స్అండ్ కేబుల్స్**

సత్తువ స్థితిస్థాపకత ప్రాముఖ్యతను బలోపేతం చేసే ప్రయత్నంలో ఈ లెగసీ వైర్ బ్రాండ్ తన కొత్త వాణిజ్య ప్రకటన ద్వారా దేశంలోని యువతతో మాట్లాడుతోంది. బ్రాండ్ తన కస్టమర్ల పట్ల ప్రదర్శించే నిబద్ధత వలె అనేక టెన్షన్‌లను ఎదుర్కొన్నప్పటికీ ప్రతి పాత్ర తన లక్ష్యం కోసం పనిచేయాలని నిర్ణయించుకున్న సందర్భాలపై ఈ చిత్రం ఆలోచనాత్మక వెలుగులను ప్రసరిస్తుంది. అన్ని సందర్భాల్లోనూ కేఈఐ వైర్స్ అండ్ కేబుల్‌తో సాఫీగా నడిచే ఉపకరణం పరికరం ఈ కీలక అంశాలకు మద్దతుగా ఉంటుంది.

# దొంగతనం కేసును ఛేదించిన పోలీసులు

**నలుగురి అరెస్టు.. పరారీలో మరొకరు.. నిందితులకు రిమాండ్**

**సంగరెడ్డి టౌన్, ఫిబ్రవరి 4, ప్రభాతవార్త:** దుకాణాల యజమానులకు చుక్కలు చేపూతూ దుకాణాల షటర్లు లేపి దొంగతనాలు చేసిన నలుగురు దొంగలను సంగారెడ్డి పోలీసులు అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు పంపిన సంఘటన జిల్లా కేంద్రమైన సంగారెడ్డి పట్టణంలో చోటు చేసుకుంది. శనివారం పోలీసు ఠాణాలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో సంగారెడ్డి డిఎస్‌పి రవీంద్రరెడ్డి, సిఐ శ్రీధర్‌రెడ్డితో దొంగతనం వివరాలను వెల్లడించారు. డిఎస్‌పి కథనం ప్రకారం...జనవరి 23వ తారీఖున జిల్లా కేంద్రమైన సంగారెడ్డి పట్టణంలో ప్రభుత్వ దవాఖాన ముందర గల రజాక్ ఆండ్ సన్స్ కిరాణా కొట్టులో క్యాష్ కౌంటర్ నుంచి 2వేల నగదుతో పాటు సబ్బులను ఎత్తుకెళ్లారు. 24వ తేదీన రాత్రి 12 గంటల ప్రాంతంలో కొత్త బస్టాండ్ ముందర సిమ్లా బేకరి పక్కన గల వీరభద్ర మొబైల్ షాఫ్ షట్టర్ లేపి దుకాణంలోని 31 మొబైల్స్‌లను తస్కరించి పరారయ్యారు. దొంగలించిన ఫోన్‌లను పంచేసుకుని ఎవరిదారిన వారు వెళ్లిపోయారు. ఫిబ్రవరి 4న మరో దుకాణంలో దొంగతనం చేసేందుకు రెక్కీ నిర్వహించేందుకు నలుగురు వ్యక్తులు తిరిగి సంగారెడ్డి పట్టణంలోని మెయిన్ రోడ్డులో గల కరుణ పాఠశాల వద్దకు చేరుకోగా పెట్రోలింగ్ చేస్తున్న పోలీసులకు అనుమానం వచ్చి అదుపులోకి తీసుకుని విచారణ చేయగా పట్టణంలో దొంగతనాలు చేసింది తామే అని ఒప్పుకున్నారన్నారు. దొంగలించిన మొబైల్స్‌లను మల్లేపల్లిలోని ముషారఫ్ గదిలో దాచిఉంచినట్లు ఒప్పుకున్నారన్నారు. నలుగురు వ్యక్తులను రిమాండ్‌కు పంపి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు డిఎస్‌పి వివరించారు. సమావేశంలో కానిస్టేబుల్ అన్వర్, రవీందర్, శివాజీ, సాయిలులు ఉన్నారు.



దొంగలను ప్రవేశపెట్టి వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు



వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

## పేదలకు డబుల్ బెడ్‌రూమ్ ఇల్లు ఇవ్వాలి

**సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బి నాగేశ్వరావు**

**పటాన్‌చెరు, ఫిబ్రవరి 4, ప్రభాతవార్త:**

అర్హులైన పేదకు ప్రభుత్వం డబుల్ బెడ్ రూమ్ ఇల్లు కేటాయించాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బి నాగేశ్వరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పేదలకు డబుల్ బెడ్రూం ఇండ్లు ఇవ్వాలని శనివారం సిఐటియు ఆధ్వర్యంలో పటాన్‌చెరు తాహసిల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం తాహసిల్దార్ పరమేశంకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాగేశ్వరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం 2017 సంవత్సరంలో డబుల్ బెడ్రూం ఇండ్లు ఇస్తామని ప్రకటించిన పటాన్‌చెరు నియోజకవర్గంలో నేటికి ఒక్కరికి కూడా ఇవ్వలేదని విమర్శించారు. మండలంలో పెద్ద గ్రామామలైన ముత్తంగి, ఇస్నాపూర్, చిట్కుల్, రుద్రారం, భానూర్, ఇంద్రేశం లాంటి గ్రామాల్లో ఎలాంటి చర్యలు చేపట్టలేదని ఆరోపించారు. అర్హులైన పేదలనుంచి నేటికి దరఖాస్తులు తీసుకోలేదన్నారు. పటాన్‌చెరు పట్టణంలో దరఖాస్తులు తీసుకున్నప్పటికి ఎలాంటి పురోగతి లేదన్నారు. ఇస్నాపూర్ ప్రాంతంలో వేలాది మంది ప్రజలు గత 25 సంవత్సరాలుగా అద్దె ఇళ్లలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఇప్పటికైన అర్హులైన పేదలకు డబుల్ బెడ్రూం ఇండ్లు ఇవ్వాలని లేని పక్షంలో ఆందోళన మరింత తీవ్రతరం చేస్తామని, ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు నర్సింగరావు, విష్ణు, కృష్ణబుచ్చిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఆత్మకూర్‌లో ఘనంగా జ్యోతిర్లింగాలకు మహాపడిపూజ



ఆత్మకూర్ శివాలయంలో మహాపడిపూజలో జ్యోతిర్లింగాలకు జ్యోతివెలిగిస్తున్న శివస్వాములు

**సదాశివపేట, ఫిబ్రవరి 4, ప్రభాతవార్త:**

శనివారం నాడు మధ్యాహ్నం సదాశివపేట మండలం ఆత్మకూర్ గ్రామంలోని భ్రమరాంభ మల్లికార్జునస్వామి దేవాలయంలో జ్యోతిర్లింగాల మహాపడిపూజను ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని సుధాకర్‌రెడ్డి కుమారుడైన సమరసింహారెడ్డి శివమాలాధారణ చేసుకున్న సందర్భంగా ఈ మహాపడిపూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. వారి గురుస్వామి అయిన రచ్చన్న స్వామి, శివస్వాములు బృందం ఆధ్వర్యంలో సమరసింహారెడ్డి వారి కుటుంబం చేత 12 జ్యోతిర్లింగాలకు శాస్రోత్తకంగా పూజలు నిర్వహించారు. భక్తి పాటలు, భజన కార్యక్రమాలతో దేవాలయ పరిసర ప్రాంతంలో మారు మోగాయి. అనంతరం మహాపడిలోని 12 జ్యోతిర్లింగాలకు జ్యోతిని వెలిగించి హారతినిచ్చారు. అనంతరం తీర్థప్రసాద వితరణ గావించారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూర్ ఎంపీటీసీ సత్యనారాయణ యాదవ్, గ్రామ పెద్దలు, శివస్వాములు గంగారం, శ్రీనివాస్, శంకర్, సంగమేశ్వర్, సురేష్, మల్లేశం, సురేందర్, రాకేష్, సాయి, బలరాజ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా కోర్టులో కంటి వెలుగు శిబిరం

**-పరీక్షలు చేయించుకున్న 148 మంది**

**సంగారెడ్డి టౌన్, ఫిబ్రవరి 4, ప్రభాతవార్త:** జాతీయ, రాష్ట్ర, జిల్లా న్యాయసేవాధికార సంస్థ, సూచనల మేరకు జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ యస్ శశిదర్ రుఎడ్డి అధ్యక్షతన శనివారం జిల్లా కేంద్రమైన సంగారెడ్డి పట్టణంలోని కోర్టు ఆవరణలో కంటి వెలుగు శిబిరాన్ని నిర్వహించారు. కోర్టు న్యాయవాదులు, సిబ్బంది కంటి పరీక్షలను చేయించుకున్నారు. శిబిరంలో 148 మందికి కంటి పరీక్షలు చేసినట్లు న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి జె హనుమంతరావు పేర్కొన్నారు. న్యాయమూర్తులు, న్యాయవాదులు జి సదుర్శన్, యం రాధాక్రిష్ణచౌహాన్,సి లక్ష్మణ చారి తదితరులు పాల్గొన్నారు.

## భాషా ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించాలి

**జహీరాబాద్, ఫిబ్రవరి 4, ప్రభాతవార్త:** గత 20 సంవత్సరాల నుంచి ఉన్నత పాఠశాలల్లో భాషా పండితులుగా బాధ్యతలు నిర్వహిస్తున్నా ప్రభుత్వం పండితులకు పదోన్నతులు కల్పించకచుండా తీవ్ర అన్యాయం చేస్తోందని భాష పండితులు ఆందోళన వ్యక్తం చేశారు. భాషా పండితులకు పదోన్నతులు కల్పిస్తామని 2017లో ప్రపంచ తెలుగు మహాసభల్లో ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు హామి చేసి 5 సంవత్సరాలు గుడుస్తున్నా పండితులకు పదోన్నతులు కల్పించలేదని విచారం వ్యక్తం చేశారు. పండితులకు పదోన్నతులు కల్పించే వరకు 9, 10వ తరగతి విద్యార్థులు విద్యా బోధన చేసేంది లేదని పేర్కొన్నారు. చట్ట ప్రకారం తమ హక్కులను కాపాలని పట్టణంలోని బాబా సాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం అందచేశారు.

## 6 నుంచి తిరగబడరా సామీ చిత్రం షూటింగ్

**జహీరాబాద్, ఫిబ్రవరి 4, ప్రభాతవార్త:** ఈ నెల 6వ తారీఖు నుంచి మార్చి 6వరకు సురక్ష ఎంటర్‌టైన్‌మెంట్ మీడియా పతాకంపై డిసిసిబి చైర్మన్, బిఆర్ఎస్ నేత మల్కాపురం శివకుమార్ నిర్మాతగా ఏఎస్ రవికుమార్ చౌదరి దర్శకత్వంలో తిరగబడరా సామీ చిత్రం షుటింగ్ కార్యక్రమాలను ప్రారంభించనున్నట్లు నిర్మాత మల్కాపురం శివకుమార్ పేర్కొన్నారు. రాజ్ తరుణ్, మాల్విలు హీరో హీరోయిన్‌లుగా నటిస్తున్న చిత్రంలో రఘుబాబు, మకరంద్ దేశ్‌పాండే, పోసాని, రాజా రవీంద్ర, భరత్ భాటియా, జాన్ విజయ్, తాగుబోతు రమేషన, భద్రం, బిత్తిరి సత్తి, మన్నారా చోప్రా, అంకిత, గీతాసింగ్, ప్రగతి తదితరులు నటిస్తున్నారన్నారు. జహీరాబాద్ నియోజకవర్గ పరిసరాల్లో ఈ నెల 6వ తేదీ నుంచి షటింగ్ ప్రారంభించనున్నట్లు, స్థానికుల టాలెంట్‌ను ఉత్తేజపర్చేందుకు నిర్ణయించినట్లు, అందుకు 5 సంవత్సరాల వయసు నుంచి 50 సంవత్సరాల వయసు గల వారు నటించాలనుకుంటే 7207264666 నంబర్‌ను సంప్రదించాలని మల్కాపురం శివకుమార్ వివరించారు.

## కంటి వెలుగు శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

**జిల్లా కలెక్టర్ డాక్టర్ శరత్**

**సంగారెడ్డి బ్యూరో, ఫిబ్రవరి 4, ప్రభాతవార్త:**

రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న కంటి వెలుగు శిబిరాలను జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ శరత్ శనివారం నాడు ఒక ప్రకటనలో సూచించారు. కంటి వెలుగు కార్యక్రమంలో 18 సంవత్సరాలు పైబడిన వారందరూ కంటి పరీక్షలు చేయించుకోవాలన్నారు. జిల్లాలో 18 సంవత్సరాలు పైబడిన వారందరూ కంటి పరీక్షలు చేయించుకోవాలన్నారు. జిల్లాలో 18 సంవత్సరాలు పైబడిన 17,11,685 మందికి కంటి పరీక్షల నిర్వహణ లక్ష్యంగా 69 బృందాలతో జనవరి 19 నుండి సోమవారం నుండి శుక్రవారం వరకు (ప్రభుత్వ సెలవు దినాలు మినహా) ప్రతిరోజు ఉదయం 9 గంటల నుండి సాయంత్రం నాలుగు గంటల వరకు కంటి వెలుగు శిబిరాలలో పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. కంటి వెలుగు రెండో విడతలో భాగంగా ఇప్పటి వరకు (ఫిబ్రవరి, 3 నాటికి) జిల్లాలో 1,59,053 మందికి కంటి పరీక్షలు చేసినట్లు తెలిపారు. అందులో 83,448 మంది మహిళలకు, 75,469 మంది పురుషులకు కంటి పరీక్షలు నిర్వహించడం జరిగిందన్నారు. ఇట్టి శిబిరాల్లో ఇప్పటివరకు 22,274 మందికి రీడింగ్ గ్లాసెస్ ఇవ్వడం జరిగిందన్నారు. 17,600 మందికి ప్రిస్క్రైబ్డ్ అద్దాలు అవసరమని గుర్తించడం జరిగిందని పేర్కొన్నారు. ప్రిస్క్రైబ్డ్ అద్దాలు వెంటనే ఆర్డర్ చేస్తున్నామని, సంబంధితులకు కంటి అద్దాలు రాగానే అందించడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. 1,19,179 మందికి ఏలాంటి కంటి సమస్యలు లేనట్లు గుర్తించారని తెలిపారు. జిల్లాలో ఇప్పటి వరకు 41 గ్రామ పంచాయతీలలో మున్సిపాలిటీలలోని 17 వార్డులలో పూర్తిస్థాయిలో కంటి పరీక్షలు పూర్తయినట్లు పేర్కొన్నారు. క్యాంపులు నిర్వహించే ప్రదేశాలనను సంబంధించి ఏ రోజు, ఏ గ్రామంలో, ఆయా మున్సిపాలిటీలలో ఏ వార్డులలో నిర్వహిస్తున్న విషయాన్ని ముందస్తుగా తెలియజేస్తున్నామని పేర్కొన్నారు. శిబిరంలో అవసరమైన వారికి మందులు, కళ్లద్దాలు ఉచితంగా ఇస్తారని తెలిపారు. కంటికి సంబంధించి ఏ సమసస్య ఉన్నా నిర్లక్ష్యం చేయవద్దన్నారు. 18 సంవత్సరాలు పై బడిన వారందరూ కంటి వెలుగు శిబిరాలలో కంటి పరీక్షలు చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. అందరి భాగస్వామ్యంతో కంటి వెలుగు కార్యక్రమం విజయవంతం చేయాలని ఆయన కోరారు.

## అంబేద్కర్ జీవితం స్ఫూర్తిదాయకం

**పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి**



అంబేద్కర్ విగ్రహం ఏర్పాటుకు భూమిపూజ చేస్తున్న మహిపాల్‌రెడ్డి

**రామచంద్రాపురం, ఫిబ్రవరి 4, ప్రభాతవార్త:**

భారతరత్న, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ జీవితం నేటి తరాలకు స్ఫూర్తిదాయకమని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. శనివారం తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలోని వెలిమల తండా, కొల్లూరులో ఏర్పాటు చేయనున్న డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహాల భూమిపూజ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అంబేద్కర్ స్ఫూర్తితో ఏర్పడిన తెలంగాణ రాష్ట్రంలో ముఖ్యమంత్రి కెసిఆర్ అన్ని వర్గాల సంక్షేమానికి పెద్ద ఎత్తున నిధులు కేటాయిస్తూ, ఆర్థిక అభ్యున్నతికి కృషి చేస్తున్నారని తెలిపారు. దేశంలోనే మొట్టమొదటిసారిగా దళితుల కోసం దళితబంధు పథకాన్ని ప్రవేశపెట్టి దేశంలోనే సంచలనం సృష్టించారని అన్నారు. పటాన్‌చెరు నియోజకవర్గంలో పైలెట్ ప్రాజెక్టుగా మూడు గ్రామాల్లో దళితబంధు పథకాన్ని ప్రవేశపెట్టి, వారి అభివృద్ధికి సంపూర్ణ తోడ్పాటు అందిస్తున్నామని తెలిపారు. దీంతో పాటు ప్రభుత్వం సంక్షేమ పథకాల అమలులోను దళితులకు పెద్దపీట వేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ లలితా సోమిరెడ్డి, వైస్‌చైర్మన్ రాములు గౌడ్, భారత రాష్ట్ర సమితి మున్సిపల్ అధ్యక్షుడు రాంగం దేవేందర్ యాదవ్, ఆయా వార్డుల కౌన్సి లర్లు, కో-ఆప్షన్ సభ్యుడు, దళిత సంఘాల ప్రతినిధులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## మిషన్ భగీరథ పనులు ప్రారంభం

**పటాన్‌చెరు, ఫిబ్రవరి 4, ప్రభాతవార్త:**

జిన్నారం పంచాయతీ పరిధిలోని పెద్దమ్మగూడెం గ్రామంలో ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి సహకారంతో 250 మీటర్ల మిషన్ భగీరథ పనులను శనివారం స్థానిక ఎంపీటీసీ వెంకటేశం గౌడ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే సహకారంతో గ్రామంలో అభివృద్ధి, మౌళిక వసతుల కల్పనకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, వార్డు సభ్యులు ఏర్పుల లింగం, కోగర్ శ్రీధర్ శ్రీనివాస్ యాదవ్, కో-ఆప్షన్ సభ్యులు శ్రీనివాస్ గౌడ్, నాయులు బ్రహ్మేందర్ గౌడ్, తోట నర్సింగరావు, గ్రామస్తులు యాదయ్య, సర్వేషా భిక్షపతి, అశోక్ పాల్గొన్నారు.



మిషన్ భగీరథ పనులు ప్రారంభిస్తున్న ఎంపీటీసీ వెంకటేశం గౌడ్

## భవాని మెడికల్ దుకాణంపై చర్యలకు డిమాండ్

**పాపన్నపేట, ఫిబ్రవరి 4, ప్రభాతవార్త:** మండల కేంద్రమైన పాపన్నపేటలో అర్హత లేకుండా నిర్వహిస్తున్న మెడికల్ దుకాణ నిర్వాహకుడిపై చర్యలు తీసుకోవాలని మెడికల్ అసోసియేషన్ సంఘం ప్రతినిధులు డిమాండ్ చేశారు. మండల మెడికల్ అసోసియేషన్ అధ్యక్షుడిపై సభ్యులు ఫైర్ అయ్యారు. మండల మెడికల్ అసోసియేషన్ అధ్యక్షుడి బంధువు పేరుతో కొనసాగుతున్న భవాని మెడికల్ షాప్ ఎలాంటి అర్హత లేని వ్యక్తితో దుకాణాన్ని నడిపిస్తున్నారని ఆరోపించారు. రోగుల ప్రాణాలకు ప్రమాదం ఉందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. మండల మెడికల్ అసోసియేషన్ అధ్యక్షులు గజవాడ రాజేశ్వర్ జిల్లా డ్రగ్స్ అధికారులను తప్పుదోవ పట్టించడమే కాకుండా అసోసియేషన్ సభ్యులకు అన్యాయం చేస్తున్నారని వారు విచారం వ్యక్తం చేశారు. సంబంధిత జిల్లా అధికారులు వెంటనే స్పందించి దుకాణంపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

## శెల్గిర పాఠశాల విద్యార్థులకు బహుమతులు

**మనూర్, ఫిబ్రవరి 4, ప్రభాతవార్త:** శ్రీ సత్యసాయి సేవా సంస్థల ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా (మానవ సేవే మాధవ సేవ) అంశంపై నిర్వహించిన వ్యాస రచన పోటీల్లో ప్రతిభ చాటిన విద్యార్థులకు సేవా సంస్థ జిల్లా అధ్యక్షులు ఎస్ శంకరప్ప బహుమతులు అందచేశారు. పోటీల్లో భాగంగా మండలంలోని శెల్గిర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు వ్యాస రచన పోటీల్లో పాల్గొని వ్యాసాలను రాశారు. పాఠశాల నుంచి వ్యాసాలు రాసిన విద్యార్థుల్లో ప్రతిభ చాటిన ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందించి ప్రోత్సాహించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎల్ అనిత, ఉపాధ్యాయులు ఎస్ మంజుల దేవి, సిహెచ్ నర్సప్ప, బి జ్యోతి, పి సాయిబాబా, వి నీరజ పాల్గొన్నారు.

## గుంజోటికి చేరుకున్న పాత పంటల జాతర

**-8న మండల కేంద్రంలో సమావేశం**



గుంజోటిలో పాత పంటల జాతరకు స్వాగతం పలుకుతున్న మాజీ జడ్పీటిసి చంద్రప్ప

**న్యాల్‌కల్, ఫిబ్రవరి 4, ప్రభాతవార్త:** జహీరాబాద్‌లోని దక్కన్ డెవలప్‌మెంట్ సొసైటీ వారి ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం సంక్రాంతి పర్వదినం రోజు నుంచి ప్రారంభం అయ్యే పాత పంటల జాతర ఈ నెల 14న జహీరాబాద్ నియోజకవర్గం మొగుడంపల్లి మండలంలోని జాంగార్‌బోడి తండాలో ప్రారంభం అయింది. జాంవగార్‌బోడి తండా నుంచి మన్నాపూర్, ఉప్పరపల్లి తండా, జాడిమల్కాపూర్, లచ్చునాయక్ తండా, జీడిగడ్డ తండా, అర్జున్ నాయక్ తండాల గుండా షేఖాపూర్, గొడిగార్‌పల్లి, బిలాల్‌పూర్, చిల్కపల్లి, బిడెకన్నె, పోట్‌పల్లి గ్రామాల్లో జాతరను నిర్వహిస్తూ ఈ నెల 3వ తారీఖున మండలంలోని రేజింతల్ గ్రామానికి పాత పంటల జాతర చేరుకున్న విషయం పాఠకులకు విధితమే. శనివారం మండలంలోని హుసెళ్లి, గుంజోటి గ్రామాల్లో పాత పంటల జాతర చేరుకోగా గుంజోటిలో మాజీ జడ్పీటిసి సభ్యులు బ్యాత చంద్రప్ప ఆధ్వర్యంలో జాతరను ఘనంగా స్వాగతం పలికారు. ఆయా గ్రామాల్లో అందంగా అలంకరించిన ఎడ్ల బండ్లను గ్రామస్థులు స్వాగతం పలుకాగా డిడిఎస్ బాధ్యులు కోలాటం ఆడుతూ పాటలు పాడుతూ గ్రామంలోని పురవీధుల గుండా బండ్లను ఊరేగించారు. ఈ నెల 5 తారఖున జాతరకు ఉండదని, 6న మండలంలోని శంశల్లాపూర్ గ్రామానికి జాతర చేరుకుఉంటుందని డిడిఎస్ బాధ్యులు వినయ్‌కుమార్ వివరించారు. ఈ నెల 8న మండల కేంద్రమైన న్యాల్‌కల్‌లో సమావేశం ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు.

## కురుమ సంఘం రాష్ట్ర కార్యదర్శికి సన్మానం

**న్యాల్‌కల్, ఫిబ్రవరి 4, ప్రభాతవార్త:** కురుమ సంఘం రాష్ట్ర కార్యదర్శిగా నియమితులైన ప్రముఖ న్యాయవాది శ్రీనివాస్ ఖన్నాను, జిల్లా అధ్యక్షులుగా నియమితులైన ప్రవీణ్‌కుమార్‌లను కురుమ సంఘం ఆధ్వర్యంలో శనివారం ఘనంగా సన్మానంచినట్లు మండలంలోని మల్గి గ్రామ సర్పంచ్, మండల సర్పంచుల ఫోరం ఉపాధ్యక్షులు, కురుమ సంఘం నాయకులు మారుతి జట్‌గొండ పేర్కొన్నారు. కురుమల అభ్యున్నతికి సేవలు అందిచాలని బాధ్యులకు వినతి చేసినట్లు ఆయన పేర్కొన్నారు. ఇదిలా ఉండగా ఈ నెల 13న గ్రామ శివారులోని కొండగట్టుపై కొలువై ఉన్న శ్రీ నవనాథ్ సిద్ధశ్వర ఆలయ ఆవరణలో శివస్వాముల మహాపడిపూజా కార్యక్రమంలో పాల్గొనేం దుకు కురుమ సంఘం జిల్లా అధ్యక్షులు నగేష్‌కు ఆహ్వాన పత్రం అందచేసినట్లు మారుతి యాదవ్ వివరించారు.

## బ్రుసెల్లో వ్యాధి నివారణ టీకాలు వేయించాలి

**జిల్లా పశు వైద్యాధికారి డాక్టర్ విజయ్ శేఖర్ రెడ్డి**

**కౌడిపల్లి, ఫిబ్రవరి 4, ప్రభాతవార్త:** పశు పోషకులు (రైతులు) తమ పశువులకు బ్రుసెల్లో వ్యాధి నివారణ టీకాలను ఇప్పించి, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పశు వైద్యాధికారి డాక్టర్ విజయ్ శేఖర్ రెడ్డి తెలిపారు. శనివారం నాడు మండల పరిధిలోని ధర్మాసాగర్, రాయిలాపూర్ గిరిజన తాండలల్లో మండల పశు వైద్యాధికారి డాక్టర్ రాజు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బ్రుసెల్లో వ్యాధి నివారణ శిబిరాలను జిల్లా పశువైద్యా ధికారి డాక్టర్ విజయ్ శేఖర్ రెడ్డి ఆకస్మీకంగా తనిఖీ చేశారు. ముందుగా ఆయన శిబిరం వద్ద కల రిజిస్టర్, వ్యాక్సిన్ తేమ శాతం పరిశీలించారు. స్థానిక విలేకర్లతో జేడి డాక్టర్ విజయ్ శేఖర్ రెడ్డి మాట్లాడుతు రైతులు తప్పకుండా తమ ఆడ దూడలకు తప్పనిసరిగా బ్రుసెల్లో వ్యాధి నివారణ టీకాలు వేయించుకోవాలని రైతులకు హితువు పల్కిన్నారు. ఈ టీకా నాల్గు నెలల నుండి 8 నెలలు ఉన్న ఆవు దూడలకు ఇవ్వడం జరుగుతుందని ఆయన తెలిపారు. కౌడిపల్లి పశు వైద్యాధికారి డాక్టర్ రాజు, జేవిఓ కృష్ణ కుమార్, ఎల్ఎస్ ఏ వీరారెడ్డి, వెటర్నరీ అసిస్టెంట్ చెన్నయ్య, రైతులు పాల్గొన్నారు.

## పెద్దమ్మ తల్లి ఆలయంలో ప్రత్యేక పూజలు

**కోహెడ, ఫి బ్రవరి 4, ప్రభాతవార్త :**

మండల పరిధిలోని కూరెళ్ల గ్రామంలో పెద్దమ్మ తల్లి బోనా సందర్భంగా శ్రీ పెద్దమ్మ తల్లిని మాజీ రాష్ట్ర హౌస్ ఫెడ్ చైర్మన్, హుసా నాబాద్ నియోజకవర్గ బిజెపి నాయకులు బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి శనివారం దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ పెద్దమ్మ తల్లి అలయానికి తన వంతు సహకారం అందిస్తానని తెలిపారు. గ్రామ ప్రజలకు అమ్మవారి అశీస్సులు ఎల్లా వేళాల ఉండాలన్నారు. గ్రామంలోని రైతులు సుభిక్షంగా కాపాడాలని అమ్మవారిని వేడుకున్నట్లు తెలిపారు. అయన వెంట పార్టీ నాయకులు వేణుగోపాల్‌రావు, సత్యనారాయణ, శ్రీనివాస్, ఖమ్మం వెంకటేశం,గాజుల వెంకటేశం, శివ,నగేష్, తిరుపతి, రాజ్‌కుమార్, వెంకటేష్, మల్లికార్జున్, సంజీవ్, యాదగిరి, శ్రీకాంత్, శ్రీనివాస్, రామచంద్రం, రాజయ్య తదితరులు ఉన్నారు.

## ఎల్లమ్మతల్లి గుడి నిర్మాణానికి ఆర్థిక సాయం

**గుమ్మడిదల, ఫిబ్రవరి 4, ప్రభాతవార్త:** కాంగ్రెస్ పార్టీ పటాన్‌చెరు నియోజకవర్గ ఇంఛార్జ్ కాట శ్రీనివాస్ గౌడ్ ఎల్లమ్మ తల్లి దేవాలయం నిర్మాణానికి 1,51,116 రూపాయలు విరాళం అందజేసి దైవభక్తిని చాటుకున్నారు. గుమ్మడిదల మండలం గుమ్మడిదల గ్రామంలో నిర్మిస్తున్న శ్రీ ఎల్లమ్మ తల్లి గుడి నిర్మాణానికి ఆయన తనవంతు ఆర్థిక సహాయం అందించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల వర్కింగ్ అధ్యక్షుడు నర్సింగ్‌రావు, దేవాలయ కమిటీ అధ్యక్షుడు బాల్‌రెడ్డి, వాసుదేవరెడ్డి, సదానందరెడ్డి, మహిపాల్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, బాలరాజ్ తదితరులు పాల్గొన్నారు.